తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ|| జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
ఆదివారం
2 ఆగస్టు 2026
పేజీలు - 8





# స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం

## వీడని బంధం స్నేహం..
## నేడు ఫ్రెండ్ షిప్ డే....



చెన్నారావుపేట, ఆగస్టు 1( జనం సాక్షి): స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం... సృష్టిలో తీయని పదం స్నేహం... ఊహ తెలియని వయసు నుంచి వదిలేవరకు స్నేహితులను మరిచిపోలేని రోజు నేడు ఆదివారం... నిరాశలో చిరు ఆశగా.... దుఃఖంలో ఓదార్పుగా... సంతోషంలో భాగంగా జీవితంలో ప్రతి ఒక్కరికి స్నేహితుడు తప్పనిసరి అవసరం. సోషల్ నెట్వర్కింగ్ వచ్చిన నేపథ్యంలో స్నేహితుల మధ్య దూరం తగ్గిపోయిందని చెప్పవచ్చు. విడిపోయిన చిన్ననాటి స్నేహితులను కూడా కలిపింది. ఖండాలు దాటిన స్నేహితులను సోషల్ మీడియా కలుపుతోంది. దేశ విదేశాలకు ఒక్కసారి అప్ లోడ్ చేస్తే ఇట్టే చేరిపోయే ఫేస్ బుక్... వాట్సాప్ ల ద్వారా కూడా ఫ్రెండ్స్ అయిన వారు చాలామంది ఉన్నారు.

### ఫ్రెండ్ షిప్ డే ఎలా వచ్చింది...

1935లో యుఎస్ఏ ప్రభుత్వం ఆగస్టు మొదటి శనివారం ఒక వ్యక్తిని మరణశిక్షతో చంపడంతో ఆ విషాదాన్ని భరించలేని అతని స్నేహితుడు మరుసటి రోజు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితుని మరణాన్ని తట్టుకోలేక తాను ఆత్మహత్య చేసుకున్న ఆగస్టు నెలలో వచ్చే మొదటి ఆదివారాన్ని ఫ్రెండ్ షిప్ డేగా యూఎస్ఏ ప్రభుత్వం ప్రకటించింది. అప్పటినుండి ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు నెలలో ఆదివారం నేడు స్నేహితుల సంబరాలు జరుపుకుంటున్నారు.

### సోషల్ మీడియా హల్ చల్...

ప్రపంచంలో సోషల్ మీడియా హల్ చల్ చేస్తోంది. పదేళ్ల క్రితం విడిపోయిన వాళ్లంతా చాలా స్నేహంగా ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా అందుబాటులో ఉంటున్నారు. నిత్యం ఫేస్ బుక్, వాట్సాప్, స్టేటస్ లతో టైంపాస్ బాగా చేస్తున్నారు. అయితే సోషల్ నెట్వర్కింగ్ సైట్ల వల్ల దూరమైన స్నేహితులు దగ్గరయ్యారని సంబరపడుతున్నారు కొందరు వాట్స్ ఆప్ ఉత్సాహవంతులు. వాట్సాప్, ఫేస్ బుక్ ద్వారా స్నేహితులు ఎప్పుడూ టచ్ లో ఉంటున్నారు. సరదాగా ఆడి పాడిన స్నేహితులు దూరమైనందుకు బాధపడ్డామని ఇప్పుడు ఫేస్ బుక్, వాట్సాప్ పుణ్యమా అని వాళ్లను కలుసుకునే అవకాశం దక్కిందంటున్నారు. మార్కెట్లోకి స్మార్ట్ ఫోన్లు వచ్చినప్పటినుండి సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా చూపుతోంది. వాటి సేవలను కూడా అధికంగా వినియోగిస్తున్నారు.

### వాట్సాప్ హంగామా...

ఖండాలు దాటిన స్నేహాన్ని వాట్సప్ కలిపింది. ఎప్పుడో చిన్నప్పుడు స్కూల్లో పదవ తరగతి చదివిన స్నేహితులందరూ దూరమయ్యారు. వాట్సప్ పుణ్యమా అని ఎప్పటికప్పుడు వాట్సాప్ లో వాట్స్అప్ గ్రూపులను క్రియేట్ చేసుకుని వారి ప్రతీ కదలికలను పంచుకుంటున్నారు. 2009లో దీన్ని ఆవిష్కరించిన ఇప్పుడు అందరి చేరువలోకి వచ్చింది. మన దేశంలో దాదాపు 80 మిలియన్ల జనాభా దీన్ని వాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏ మూల నుంచి అయినా దీన్ని ఉపయోగించుకునే సౌకర్యం, సర్వీస్ ప్రొవైడర్లతో సంబంధం లేకుండా ఎటువంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో అందరూ మొగ్గు చూపుతున్నారు. రోజుకు 80 కోట్లకు పైగా ఫోటోలు, 110 కోట్లకు పైగా మెసేజ్ లు వాట్సాప్ ద్వారా షేర్ మిగతా 13లో..

# ప్రతి ప్రయాణం సురక్షితంగా ఉండాలి

### జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రతి ప్రయాణం సురక్షితంగా ఉండాలి అని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. అరైవ్ ఎలైవ్ -- ప్రత్యేక తనిఖీలు కార్యక్రమంలో భాగంగా శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 50 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, రాకపోకల నిబంధనల అమలు, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ డ్రైవ్ ను జిల్లా పోలీసు శాఖ, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, నడిపే అనుమతి పత్రాలు, తల రక్షణ కవచం, సీటు బెల్టు వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం, తల రక్షణ కవచం లేకుండా రెండు చక్రాల వాహనాలు నడపడం వంటి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై జరిమానాలు విధించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ప్రమాణాల తల రక్షణ కవచం ధరించాలి, సీటు బెల్టు వినియోగించాలి, నిర్ణీత వేగ పరిమితులను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



### ఆపరేషన్ ముస్కాన్‌లో 48 మంది చిన్నారులకు రక్షణ..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్--2026 కార్యక్రమాన్ని జిల్లాలో జూలై 1 నుండి జూలై 31 వరకు విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి బాల కార్మికులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించడం జరిగిందన్నారు. మొత్తం 48 మంది చిన్నారులను రక్షించారని, వీరిలో ఆరుగురు బాలికలు, 42 మంది బాలురు ఉన్నారు. సబ్‌డివిజన్ వారీగా భూపాలపల్లి సబ్‌డివిజన్‌లో 26 మంది, కాటారం సబ్‌డివిజన్‌లో 22 మంది చిన్నారులను రక్షించారని తెలిపారు. రక్షించిన చిన్నారులను సంబంధిత అధికారుల సమక్షంలో వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు అప్పగించడం జరిగిందన్నారు. అవసరమైన వారికి మిగతా 13లో..




# బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి చైర్మన్ వీరయ్య

**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 1 (జనంసాక్షి) :** బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, అదనపు సీనియర్ సివిల్ జడ్జి- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామ్ మోహన్ రెడ్డి, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కె. నిరోషా, స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (ఎక్సైజ్) బి. కృష్ణ తేజ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య లతో కలిసి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, పోక్సో చట్టంపై ఏర్పాటు చేసిన ఒక్కరోజు అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ.... బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో బాలల హక్కుల పరిరక్షణ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో విపరీతమైన పోకడలతో చిన్న వయసులోనే దారి తప్పుతున్నారని, సోషల్ మీడియా ప్రభావం సమాజంపై పడి పిల్లలలో సైతం చెడు ప్రవర్తన కలుగుతుందని తెలిపారు. పిల్లలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని, చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలని, సమాజం పట్ల బాధ్యతలను తెలియజేయాలని అన్నారు. సమ సమాజ స్థాపనలో గురువుల పాత్ర అనిర్వచనీయమైనదని, పిల్లలు, కళాశాల యువత మద్యపానం, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాధ్యతగా వారిని సన్మార్గంలో నడిచే విధంగా తీర్చిదిద్దాలని తెలిపారు. పిల్లల హక్కుల పరిరక్షణ కోసం స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ అందుబాటులో మిగతా 13లో..

# మహబూబ్ ఘాట్ జలపాతం సందర్శించడానికి వెళ్లొద్దు

## ఐఎఫ్ఎస్ అధికారి సుక్దేవ్ బోబడే



**సారంగాపూర్,ఆగస్టు1(జనం సాక్షి)** నిర్మల్ సమీపంలోని మహబూబ్ ఘాట్ జలపాతం వద్ద భారీ వర్షాల కారణంగా ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజలు, పర్యాటకులు ఆ ప్రాంతానికి వెళ్లవద్దని జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖ్దేవ్ బోబడే (ఐఎఫ్ఎస్) హెచ్చరించారు. అనవసర సాహసాలు ప్రాణాలకు హాని కలిగిస్తాయని ఆయన తెలిపారు. నిర్మల్ పట్టణానికి సమీపంలోని మహబూబ్ ఘాట్ అడవుల్లో, సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో రానాపూర్ బీట్ పరిధిలో ఉన్న జలపాతాన్ని జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖ్దేవ్ బోబడే (ఐఎఫ్ఎస్) శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు జలపాతంలోకి చేరుతుండటంతో అక్కడ పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు, పర్యాటకులు జలపాతం వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలపాతం వద్ద గుమిగూడడం, స్నానాలు చేయడం, సెల్ఫీలు దిగడం వంటి చర్యలు ప్రాణాపాయానికి దారితీసే అవకాశముందని హెచ్చరించారు. వర్షాకాలంలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరిగే అవకాశం ఉన్నందున ఎలాంటి సాహసోపేత చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ జలపాతం అటవీ ప్రాంతంలో ఉన్నందున అనుమతి లేకుండా ప్రవేశించడం, అటవీ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలపై భారత అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్షాకాలంలో ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రజలు తమ భద్రతను కాపాడుకోవాలని, అటవీ శాఖ అధికారులకు సహకరించాలని జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖ్దేవ్ బోబడే విజ్ఞప్తి చేశారు.

# ఆది మహిళలు, బాలల రక్షణపై గ్రామ సభ నిర్వహణ



**సారంగాపూర్ , ఆగస్టు1(జనం సాక్షి)** సారంగాపూర్ మండలంలో కౌట్ల బి గ్రామంలో సర్పంచ్ బల్గురి అజయ్ అధ్యక్షతన శనివారం మహిళలు బాలల రక్షణ పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండల విద్య అధికారి మహేందర్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని బాలల హక్కుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల రక్షణ చట్టాలు, పోక్సో చట్టం--2012, చైల్డ్ సేఫ్టీ, సేఫ్ టచ్--అన్‌సేఫ్ టచ్, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, ఫిర్యాదు చేసే విధానం, చట్టంలోని సెక్షన్లపై వివరించారు. దివ్యంగా చట్టాలు గూర్చి తెలిపారు. బ్రుణా హత్యలు చేయకూడదని చట్ట రీత్యా నేరమని తెలిపారు. వర్షాకాలం వీటి కాలుష్యం అయ్యి రోగాలు ప్రబలించే అవకాశం ఉంది వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇప్ప శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఈసారి శివ,ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ,కారొబారి నరసయ్య,ఉపాధ్యాయులు గణేశ్, అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు , వార్డు సభ్యులు, ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించాలి

- ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే త్రాగించాలి
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు1(జనం సాక్షి) :** ఆగస్టు 1 నుండి 7 వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాల సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యతను గురించి గర్భిణీ స్త్రీలకు , ప్రసవించిన తల్లులకు మరియు వారి సహాయకులకుఅవగాహన కలిగించాలని హనుమకొండ డీఎంహెచ్వో అప్పయ్య తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం హనుమకొండ నగరంలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి తో కలిసి పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు ఈ వారం రోజులు పాటు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు .ఈ సందర్భంగా అక్కడున్న తల్లులతో ఆయన మాట్లాడుతూ గర్భిణిగా నమోదు అయినప్పటి నుంచి ఆరోగ్య సిబ్బంది గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరుగుతుందని , అదే సమయంలో వారు తల్లిపాల ప్రాముఖ్యత ముఖ్యంగా మొదటి గంటలోనే మురుపాలు పట్టించడం, సరియైన విధానంలో పాలు పట్టించడం 6 నెలలు బిడ్డ కు తల్లి పాలను మాత్రమే తాగిశీచాలని, వివరిస్తారన్నారు. సూచించారు.పుట్టిన దగ్గర నుండి6 నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని పై ఆహారం వద్దు అని 7 నుండి 8 నెలల వయస్సు లో తల్లిపాల తో పాటు 3 సార్లు పై ఆహారం ఇవ్వాలని,9 నుండి 11 నెలలు, తల్లిపాలతో పాటు 4 సార్లుపై ఆహారం ఇవ్వాలని తెలిపారుబిడ్డ శరీరం పూర్తిగా తల్లి ఒడిలో ఉంచినందువల్ల బిడ్డకు చక్కటి ఆసరా లభిస్తుంది. దీని వల్ల తల్లి మరియు బిడ్డకు చక్కని అనుబంధం ఏర్పడుతుంది, బిడ్డకు వెచ్చదనం లభిస్తుందిబిడ్డకు రెండు స్తనాల నుంచి పాలు త్రాగించాలనారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమునైజేషన్అధికారి డాక్టర్ శ్రీ కృష్ణారావు , డాక్టర్ సుభాష్ ఆర్ ఎం ఓ డాక్టర్ మంజుల డాక్టర్ అనిల్ డెమో వి అశోక్ రెడ్డి, తల్లిపాల బ్యాంక్ ఇన్చార్జి కనిష్క పిహెచ్ఎన్ రామేశ్వరి సూపర్వైజర్, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

# మండలంలోనే తొలి మహిళా సంఘ భవనం పూర్తయింది




**నెరడిగొండ ఆగస్టు1(జనంసాక్షి):** గ్రామ అభివృద్ధి పనులు పూర్తి చేసుకోవడంలో మండలంలోనే సావుర్ గాం ముందుంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. శనివారం రోజున మండలంలోని సావుర్ గాం గ్రామంలో రూ. 10లక్షలతో నిర్మించిన నూతన మహిళ సమాఖ్య భవనాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మండలంలోనే మొట్ట మొదటి మహిళ సంఘ భవనం నిర్మాణం సావుర్ గాం జీపీ సర్పంచ్ జాధవ్ కల్యాణి మహేందర్ చురుగ్గా పనిచేయడంతోనే భవనం పూర్తయిందని,రానున్న రోజుల్లో మండలంలోని అన్ని భవనాలు పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. ఆయా గ్రామాలు పనులు చేసుకోవడంలో సావుర్ గాం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సర్పంచులు చురుక్కుగా ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని అన్నారు. గ్రామంలో ప్రతీ కుటుంబం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు ఎంపీడీఓ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 1 (జనం సాక్షి) :** హనుమకొండయూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (యూఏఎస్‌సీ) జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో 'మై భారత్' నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం సమన్వయకర్త ప్రొఫెసర్ ఈసం నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. యువతలో సామాజిక బాధ్యత, సేవాభావం పెంపొందించేందుకు 'మై భారత్' వేదిక ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి మాట్లాడుతూ, విద్యార్థులు 'మై భారత్'లో నమోదు చేసుకోవడం ద్వారా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతో పాటు నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. సమాజ అభివృద్ధికి యువత తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు "నషా ముక్త యువ -- వికసిత్ భారత్ 2047" ప్రతిజ్ఞ చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన సుమారు 400 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. ఎస్. శ్రీదేవి, డా. ఎన్. చందర్, డా. ఎ. రమేష్, ఎ. శ్రీలత సమన్వయం చేశారు. కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గ్రామస్తులకు మొక్కలు పంపిణీ

# చేసిన బోరిలాల్గూడ సర్పంచ్



**కెరమెరి,ఆగస్టు1 (జనంసాక్షి)** కేరమేరి మండలం బోరీలాల్గూడా గ్రామ పంచాయతీలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ నర్సరీ నుంచి ఇంటింటికి 6 మొక్కలను సర్పంచ్ చవాన్ శంకర్ పంపిణీ చేయడం జరిగింది. సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలని గ్రామస్తులకు సూచించారు. పల్లెలు పచ్చదనమే లక్ష్యంగా అందరు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో పెద్దికి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు



చెన్నారావుపేట, ఆగస్టు 1( జనం సాక్షి): మండలంలోని ఎల్లాయ్యగూడెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి కోవత్తులతో బిఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. గుండెపోటుతో మరణించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే ఆయన నర్సంపేట నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు మంచోజు మనోజ్ కుమార్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఎదురుబోయిన సాంబయ్య, మంద రవికుమార్, మంద సంతోష్, వేముల రాఘవేంద్ర, దోమ మహేందర్, రాహుల్ గాంధీ, సంజయ్ గాంధీ, చరణ్ రాకేష్, రాయపూరి సమ్మయ్య, కుక్కల రామచంద్రు, తదితరులు పాల్గొన్నారు.

## డీలర్లు ఎమ్మార్పీ కంటే మించి అమ్మితే కఠినచర్యలు

### వ్యవసాయ సంచాలకులు ఆదిరెడ్డి



జనం సాక్షి ఎల్కతుర్తి 1: ఎల్కతుర్తి మండలంలోని కోతులనడుమ రైతు డిపో ఫర్టిలైజర్స్‌ను సహాయ వ్యవసాయ సంచాలకులు ఆది రెడ్డి హనుమకొండ మరియు మండల వ్యవసాయ అధికారి ఎం రాజ్ కుమార్ కోతుల నడుమ తో పాటు వివిధ గ్రామాలలో ఫెర్టిలైజర్ లను శనివారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేసి బిల్లు బుక్కులు స్టాక్ రిజిస్టర్‌కు సంబంధినవి తనికి చేసినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు ఎమ్మార్పీ రేట్ కంటే అదనంగా అమ్మితే లైసెన్స్ రద్దు తో పాటు కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అన్నారు .

## పేద విద్యార్థులను చెయుత నిద్దాం

### నిరుపేద విద్యార్థులకు నోటు బుక్‌లను పంపిణీ చేసి దత్తతతీసుకున్న మర్రి రవికుమార్



హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామేర ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం మర్రి రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన పిల్లలకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 5వ తరగతి విద్యార్థిని మోక్షిత, 3వ తరగతి విద్యార్థి రుత్విక్ అనే ఇద్దరు నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకున్నట్లు తెలిపారు.విద్యార్థుల ఉన్నత చదువులు, విద్యా అభ్యాసం పూర్తయ్యే వరకు నోట్ బుక్స్, దుస్తులు, ఫీజులు తానే భరిస్తానని స్పష్టం చేశారు. హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న మర్రి రవికుమార్ సేవా భావానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్ర తిరుపతి ఉపాధ్యాయులు రాజేశ్వరి, జయప్రద, సర్పంచ్ మశికని పద్మ ప్రత్యేకంగా అభినందించారు.

## పాలకుర్తిలో పోరాట యోధుడి వర్ధంతి వేడుకలు



పాలకుర్తి, ఆగస్టు 01(జనంసాక్షి) తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి 20వ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలోని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా నిజాం రజకార్లను తరిమిన పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి పోరాటం అజరామమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల సోమన్న అన్నారు. అనాడు ప్రజల పక్షాన నిలచిన వీరులు అనేకమంది వారిలో కాచం కృష్ణమూర్తి మందంజలో ఉంటారని అన్నారు. నిజాం నవాబుల అరాచకాలపై తిరుగుబాటు చేసిన గొప్ప యోధుడని అన్నారు. పోరాట యోధుల త్యాగాలను ఆదర్శంగా తీసుకొని ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉం దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నారాయణ, సంధ్యారాణి, కొంరయ్య, యాకయ్య, మధుసూదన్రెడ్డి, వెంకన్న, రాజు, పెద్దాపురం, దామోదర్, ఎల్లయ్య, కొంరయ్య పాల్గొన్నారు.

## ఉత్తమ గ్రామ పంచాయతీగా కమలాపూర్ పేరు గడించాలి

- కమలాపూర్ మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది
- నేను ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉంది
- పెన్ను పట్టి మందులు రాయడమే కాదు పారలు పట్టి చెత్తను తొలగించగలం అని నిరూపించారు కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు



కమలాపూర్, ఆగస్టు 01 (జనం సాక్షి) ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పారిశుధ్య పరిరక్షణ చర్యలు, మొక్కలు నాటే కార్యక్రమాలతో కమలాపూర్ గ్రామం అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు అన్నారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా కమలాపూర్ గ్రామ పంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో 15 వ వారం ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పాలక మండలి,సిబ్బంది, వైద్యులు, వైద్య శాఖ సిబ్బందితో కలిసి ఎంపీడీవో కమలాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శ్రమదానంలో పాల్గొన్నారు. ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు,గడ్డి శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గుండె బాబు మాట్లాడుతూ కమలాపూర్ గ్రామపంచాయతీ పాలకమండలి ఊరు కోసం ఒకరోజు శ్రమదానం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి శనివారం శ్రమదానం చేస్తూ గ్రామాన్ని బాగు చేసుకోవడంతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. గ్రామాల్లో జనాభాకు సరిపడా సిబ్బంది లేకపోవడం నిధుల కొరత కారణంగా పారిశుధ్యం పేరుకుపోయిన నేపథ్యంలో ఇలా గ్రామస్తులను భాగస్వాములను చేసి పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టడం శుభసూచకం అన్నారు. కమలాపూర్ గ్రామం అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలవడంతో పాటు రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా గుర్తింపు తెచ్చుకునేంత వరకు అందరు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ చందు నాయక్ మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో గ్రామపంచాయతీ సర్పంచ్ పాలకమండలి సభ్యులు శ్రమదానంతో శుభ్రం చేయడం సంతోషంగా ఉందన్నారు. తాను కూడా ఒక వ్యవసాయ కుటుంబం నుండి వచ్చినవాడిని ఇలా అందరితో కలిసి శ్రమదానం కార్యక్రమంలో పాల్గొనడం మనసుకు హాయినిచ్చిందన్నారు. ఇంతకాలం పేరుకుపోయిన చెత్తాచెదారం శుభ్రమై పిచ్చి మొక్కలు తొలగించడంతో ఆసుపత్రి ఆవరణ చాలా శుభ్రంగా మారిందన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం చేపట్టడం మంచి పరిణామం అన్నారు. సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల శ్రమ విలువను గ్రామస్తులకు తెలియజేసి గ్రామస్తులను పారిశుధ్య పరిరక్షణ గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యులు చేయడమే ఊరు కోసం ఒక్కరోజు శ్రమదానం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యాధికారి నాగరాజు, సిహెచ్సి వైద్యులు రవి,అపర్ణ,స్వప్న,ప్రణీత,స్నేహ,వరుణ్ మాధవ్, ప్రవణ్య వార్డు సభ్యులు ఎండపెల్లి మల్లారెడ్డి, ఆవునూరి తిరుపతి, పుల్ల ఐలయ్య, నాయకులు అశోక్, మౌటం సంపత్, తుమ్మ రాజేష్, బైరీ రాజేష్, పచ్చిమట్ల కుమారస్వామి,చేనుమల్ల రంజిత్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ సేవలపై ప్రజల్లో చైతన్యం..

## కొత్త దుబ్బ తండా ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం



దోర్నకల్ : ఆగస్టు 1 (జనం సాక్షి) మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం కొత్త దుబ్బ తండా గ్రామ రైతు వేదికలో గురువారం బ్యాంక్ మేనేజర్ అయూబ్ ఆధ్వర్యంలో వరంగల్ డీసీసీ బ్యాంక్, నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రజల్లో బ్యాంకింగ్ సేవల వినియోగాన్ని పెంపొందించడం, పొదుపు అలవాటును ప్రోత్సహించడం, ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతాలను సక్రమంగా వినియోగించుకోవాలని, క్రమం తప్పకుండా పొదుపు చేయడం ద్వారా కుటుంబ ఆర్థిక భద్రతను పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఫిక్స్ డిపాజిట్ల ప్రాధాన్యత, బ్యాంకులు అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు, రైతులు, మహిళలు, స్వయం ఉపాధి వర్గాలకు అందుబాటులో ఉన్న సేవల గురించి వివరించారు. అదేవిధంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, కేవైసీ, వీ-కేవైసీ, ఈ-కేవైసీ విధానాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, సైబర్ మోసాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలో ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులకు వ్యవసాయ భూముల ద్వారా బ్యాంకింగ్ సేవల ప్రాధాన్యత, పొదుపు అవసరం, బీమా పథకాల ప్రయోజనాలను గ్రామస్తులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకున్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో సొసైటీ తిలక్. సూపర్వైజర్ అంజయ్య. సంపత్. మురళి. భాస్కర్ రైతులు తదితరులు పాల్గొన్నారు

## టీజీఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్‌కు ఘన సన్మానం



మహబూబాబాద్ ప్రతినిధి,ఆగస్టు 01 (జనం సాక్షి): టీజీఎన్‌పీడీసీఎల్‌లో చీఫ్ ఇంజనీర్‌గా విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన రాజు చౌహాన్ గారిని గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందా రాథోడ్, కంపెనీ గౌరవ అధ్యక్షుడు వాలు నాయక్ మాట్లాడుతూ గిరిజన సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా తలపాగా, గజమాల, శాలువా కప్పి, జ్ఞాపిక (షీల్డ్) అందజేసి ఆయన సేవలను కొనియాడారు. విద్యుత్ శాఖ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి రాజు చౌహాన్ గారు అందించిన సేవలు చిరస్మరణీయమని సంఘం నాయకులు పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో, యువ ఉద్యోగులకు మార్గదర్శకులుగా కొనసాగాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రెసిడెంట్ హర్జీ నాయక్, కంపెనీ జనరల్ సెక్రటరీ అజ్మీరా శ్రీరామ్ నాయక్, చీఫ్ అడ్వైజర్ సామ్య నాయక్, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజు చౌహాన్ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సమస్యల వలయంలో... 'నరసింహాసాగర్ '

### పట్టించుకునే వారే కరువయ్యారంటూ గ్రామస్థుల ఆవేదన!



**మంగపేట, ఆగస్టు 01 (జనంసాక్షి)** మండలంలోని నర్సింహాసాగర్ గ్రామంలో సమస్యల వలయంగా మారింది అంటూ గ్రామస్థుల ఆరోపించారు. గ్రామంలో ప్రజలు అనేక మౌలిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ, అధికారులెవరూ పట్టించుకోవడం లేదంటూ గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పూర్తి స్థాయి పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో, తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తుమని ఆరోపించారు. పంచాయతీకి తగిన నిధులు లేకపోవడంతో గ్రామంలో పారిశుద్ధ్యం పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది అని ప్రస్తుతం జోరుగా వర్షాలు కురుస్తున్నప్పటికీ.. చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ నిర్వహించడం వంటి కనీస పారిశుధ్య చర్యలు కూడా చేపట్టడం లేదు అని గ్రామస్థులు అన్నారు. దీంతో దోమల ఉధృతి విపరీతంగా పెరిగి, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మోటార్ చెడిపోయి రెండు నెలలు దాటినా, ఇప్పటివరకు ఎటువంటి మరమ్మతులు చేయలేదు అని దీనివల్ల తాగునీటి కోసం ప్రజలు నానా తంటాలు పడుతున్నారు అని అన్నారు. ఇలాంటి అత్యవసర సమస్యలు తిష్టవేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నరసింహాసాగర్ గ్రామపంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామానికి పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించి, తగిన నిధులు విడుదల చేయాలని.. పారిశుద్ధ్య పనులు, ఫాగింగ్, బ్లీచింగ్, డ్రైనేజీల శుభ్రతతో పాటు తాగునీటి మోటార్‌ను తక్షణమే మరమ్మత్తులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు అధికారులను కోరారు.

# తల్లిపాల వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 01 ( జనం సాక్షి)** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1 నుంచి 7 వరకు) జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు, మీడియా నోట్, కార్యాచరణ ప్రణాళిక ప్రకారం జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఇటీవల సూపర్వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గుర్తించిన లోపాలను పరిశీలించి, సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, గుర్తించిన ప్రతి లోపాన్ని నిర్దిష్ట గడువులోగా సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తల్లిపాలు ప్రతి శిశువుకు మొదటి హక్కు, సంపూర్ణ పోషకాహారమని పేర్కొన్నారు. పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం ద్వారా శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ సూపర్వైజర్లు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండు సంవత్సరాల లోపు పిల్లల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ సరైన కౌన్సెలింగ్ అందించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో ప్రసవించిన ప్రతి శిశవుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సీడీపీఓలు, సూపర్వైజర్లు, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా పగడ్బందీగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ

### జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు అందరి సహకారం అభినందనీయం: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి



**హనుమకొండ, ప్రతినిధి ఆగస్టు 1,(జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో విజయవంతంగా కొనసాగుతోందని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అధికారులతో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిని ఇన్‌చార్జి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, వరంగల్ పశ్చిమ ఈఆర్‌వో, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్ సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియకు తొలుత నిర్ణయించిన ఆగస్టు 3 గడువును భారత ఎన్నికల సంఘం ఆగస్టు 10 వరకు పొడిగించిందని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే ఎస్ఐఆర్ ప్రక్రియ అమలులో హనుమకొండ జిల్లా మంచి గుర్తింపు పొందిందన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి నిరంతర సమీక్షలు, సమన్వయ చర్యలతో ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, కాంగ్రెస్ పార్టీ తరఫున ఎం.డి. నేహాల్, బీజేపీ తరఫున రావు అమరేందర్ రెడ్డి, ఎలుక నిశాంత్, బీఆర్ఎస్ తరఫున బి. ప్రవీణ్ కుమార్, టీడీపీ తరఫున కుసుమ శ్యామ్ సుందర్, వైఎస్సార్సీపీ తరఫున నాగబెల్లి రజనీకాంత్, ఏఐఎంఐఎం తరఫున సయ్యద్ ఫైజుల్లా, అబ్దుల్ సత్తార్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేలేరు గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- గ్రామపంచాయతీ నిధుల నుండి ఆలయాలకి నూతన మినీ వాటర్ ట్యాంక్ :-బిల్లా యాదగిరి గ్రామ సర్పంచ్



**వేలేరు ఆగస్టు: 1(జనం సాక్షి)** వేలేరు గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని గ్రామ సర్పంచ్ బిల్ల యాదగిరి అన్నారు వేలేరు గ్రామపంచాయతీ పరిధిలోని దుర్గమ్మ, పోచమ్మ ఆలయం ఆవరణలో నూతన మినీ వాటర్ ట్యాంక్ ను నిర్మాణా పనులకు శంకుస్థాపన చేసి అనంతరం మాట్లాడుతూ.., వేలేరులోని దుర్గమ్మ గుడి ,పోచమ్మ గుడి ఆవరణలో గ్రామపంచాయతీ నిధుల నుండి నూతన మినీ వాటర్ ట్యాంక్ నిర్మించడం జరుగుతుందని, గత నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో పోచమ్మ ఆలయం వరకు నూతన సీసీ రోడ్డు ను నిర్మించడం జరిగిందని అదేవిధంగా గ్రామపంచాయతీ నిధుల నుండి లైటింగ్స్ ఏర్పాటు చేయడం జరిగింది, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం ఆవరణలో సీసీ రోడ్డు మంజూరు చేయడం జరిగింది, వేలేరు గ్రామాన్ని అభివృద్ధిలో జిల్లా లో ముందుండే విధంగా చూస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు , లక్ష్మణ్ నాయక్ ఉప సర్పంచ్ శ్రీకర్ ఏ.ఎం.సి డైరెక్టర్ సంపత్ వార్డు సభ్యులు, లక్ష్మీనారాయణ, సురేష్ ,సునీల్ ,సంధ్య , చైతన్య, మరియు కాలనీ పెద్దలు సంపత్ రెడ్డి, రాజు, సురేష్ , తిరుపతి, సదానందం, రాజశేఖర్ , నరసయ్య, రంగం, రమేష్, పాల్గొన్నారు

# సొంతగూటికి చేరిన కుంటాల బి సర్పంచ్



**నెరడిగొండ ఆగస్టు1(జనంసాక్షి):** గ్రామ అభివృద్ధి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తోనే సాధ్యంమని కుంటాల బి గ్రామ సర్పంచ్ ఆత్రం గంగారాం తోపాటు గ్రామస్తులు పేర్కొన్నారు. శనివారం రోజున మండలంలోని కుంటాల బి గ్రామ సర్పంచ్ గంగారాం తోపాటు గ్రామస్తులు తిరిగి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆత్రం గంగారాం మాట్లాడుతూ ఇతర పార్టీలో చేరి తప్పు చేశానని,మా గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరించే ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తోనే కొనసాగుతామని పేర్కొన్నారు. ఆ అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని,మీ మండల వాసిగా మీ బిడ్డగా ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటానని ఎలాంటి సమస్య వచ్చినా మీతో నిలబడతానని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### భూక్య రాజేష్ నాయక్



**ఖానాపూర్ ఆగస్టు 01 (జనం సాక్షి)** జిల్లావ్యాప్తంగా విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో ఉపాధ్యాయుల సర్దుబాటు వెంటనే చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సెక్రటేరియట్ బదిలీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత పాఠశాలలకు పంపించాలని, పాఠశాల విద్యార్థులకు ఆగస్టు 15 నాటికి ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మండల అధ్యక్షుడు బేరా చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ మలిదశ ఉద్యమంలో
## పెద్ది సుదర్శన్ రెడ్డి పాత్ర మరువలేనిది



**తొర్రూరు , ఆగస్టు 1( జనం సాక్షి):** 2001లో టిఆర్ఎస్ ఇప్పుడున్న బిఆర్ఎస్ పార్టీలో కెసిఆర్ వెంట నడుస్తూ క్రమశిక్షణ గల నాయకుడిగా పార్టీ విధేయులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఎనిమిది సంవత్సరాలు జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని గ్రామాల్లో ఉద్యమాన్ని ముందుకు నడపడంలో అతని పాత్ర మరువలేనిది అతనితో ఉన్న జ్ఞాపకాలను మాటేడు గ్రామానికి చెందిన బిఆర్ఎస్వి మాజీ తొర్రూర్ మండల అధ్యక్షుడు ఎర్ర ఉపేందర్ గుర్తు చేసుకుంటూ మీరు భౌతికంగా మా మధ్య లేకున్నా మీ ఆశయాలు లక్ష్యాలు మమ్మల్ని ముందుకు నడిపిస్తాయని కొనియాడారు, మీ ఆత్మ ఏ లోకానున్న శాంతి కలగాలని ఆ భగవంతుని కోరుకుంటున్నానని తెలిపారు.

## ఫర్టిలైజర్ షాపులపై వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ కరువు



**అల్లం రవీందర్**

**చిట్యాల, ఆగస్టు 01( జనం సాక్షి ):** ఖరీఫ్ సాగు సీజన్‌లో మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ చిట్యాల మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి అందుబాటులో ఉండడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్‌ను ఆసరాగా చేసుకుని కొందరు ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడంతో ఆగ్రోస్, రైతు సేవా కేంద్రాల పేరుతో కొందరు వ్యాపారులు అక్రమంగా అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంలో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే శాఖ కార్యాలయం ఎదుట ధర్నా, రాస్తారోకో వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## లియాపి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



**నర్సంపేట ఆగస్టు 1 (జనం సాక్షి)** నర్సంపేట పట్టణంలోని ఎల్ఐసి ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన పదవి విరమణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పులి సుధాకర్ ఘనంగా సన్మానం చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాలు నుండి ఎల్ఐసిలో పనిచేస్తూ మంచి పేరు ప్రతిష్టలు సంపాదించిన బానోతు రాములు. ప్రతి ఏజెంట్‌తో నవ్వుతూ మాట్లాడే వ్యక్తిని అతను రిటైర్మెంట్ కావటం మా నర్సంపేటకు తీరనిలోటని. అన్నారు ఆరోగ్యం బాగా లేకున్నా ఆఫీసుకు వచ్చేవాడని ఇప్పుడేనా భార్య పిల్లలతో బాగుండాలని భగవంతుని కోరుతున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట బ్రాంచ్ లియోపి. అధ్యక్షులు రాక రాజలింగం. కార్యదర్శి అలసాని సోమయ్య వల్లాల శ్రీహరి. గాదె మోహన్ రెడ్డి. సుగుణాకర్. సుబ్బారావు. యాదగిరి. ఐలయ్య. రమేష్. రామ్మోహన్. తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న కేఆర్ఆర్



**పరకాల, ఆగస్టు 1, (జనం సాక్షి):** పరకాల బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మాక్సూద్ అలీ గారి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేపించి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు కొక్కిరాల రాకేష్ రావు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాడి భగవాన్ రెడ్డి, ఎండీ బియబాని,బండి వెంకటేష్,బొమ్మకంటి నాగరాజు,కృపెందర్ రెడ్డి, ఎండీ మంజూర్ అలీ, ఖలీమ్,మైపాల్, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ఐటీడీఏ డిప్యూటీ డిఎంహెచ్వో డా. క్రాంతి కుమార్
- ప్రైవేటు డయగ్నోస్టిక్స్ సెంటర్లు పై ప్రత్యేక నజర్..!
- విధులకు గైర్హాజరైన బ్రాహ్మణపల్లి వైద్యుడికి మెమో జారీ.



**మంగపేట, ఆగస్టు 01 (జనంసాక్షి)** మండలంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. సరైన అనుమతులు లేని డయాగ్నోస్టిక్ కేంద్రాలు, నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తున్న క్లినిక్‌లపై శనివారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు స్థానిక వైద్య వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. క్రాంతి కుమార్‌తో పాటు మంగపేట మండల వైద్యాధికారి డా. అఖిల, ఐటీడీఏ ప్రోగ్రామ్ మేనేజర్ మహేందర్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ తనిఖీ లో భాగంగా మంగపేట లోని సుమా డయాగ్నోస్టిక్స్ సెంటర్, తిమ్మంపేటలోని అరవింద్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ అలాగే రాజ్‌పేట లోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలు డయాగ్నోస్టిక్ కేంద్రాల నిర్వాహకులు రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, ప్రయోగశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా, రిజిస్టర్డ్ వైద్యులు, ఎంబీబీఎస్, ఎండీ డాక్టర్లు సిఫారసు చేసిన పరీక్షలను మాత్రమే నిర్వహించాలని ఆర్ఎంపి వైద్యులు సిఫారసు చేసిన రక్త పరీక్షలను ఎట్టి పరిస్థితిలో చేయరాదని స్పష్టం చేశారు. తిమ్మంపేటలోని అరవింద్ డయాగ్నోస్టిక్స్ ఎలాంటి ప్రయోగశాల (లాబ్) రిజిస్ట్రేషన్ లేకుండానే యథేచ్ఛగా నడుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన అధికారులు తక్షణమే ఆ కేంద్రానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. నిర్దేశిత గడువులోగా లోపాలను సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో చట్టపరంగా సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాజ్‌పేటలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి కేంద్రంలోనూ అధికారులు తనిఖీలు చేసి అనధికారిక వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆ ఆర్ఎంపీని హెచ్చరించారు. రోగులకు ఎలాంటి ఇంజెక్షన్లు ఇవ్వకూడదని, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో వస్తే వెంటనే మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని కఠినంగా ఆదేశించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. క్రాంతి కుమార్ మంగపేట పీహెచ్‌సీతో పాటు బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ ఆకస్మిక తనిఖీలు బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యాధికారుడు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైహాజరవడంతో వైద్యుడికి మెమో జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ప్రబలే కాలానుగుణ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై వైద్యాధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు గ్రామాల్లో వైద్య శిబిరాలను ముమ్మరంగా నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. అనధికార ల్యాబ్‌లు, నిబంధనలు ఉల్లంఘించే నకిలీ వైద్యులపై భవిష్యత్తులోనూ దాడులు కొనసాగుతాయని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

### తాడిచర్ల డేంజర్ జోన్ ఇండ్ల సర్వేను
## పరిశీలించిన ఈజిసి రాష్ట్ర కౌన్సిలర్ కమిటీ సభ్యులు దండు రమేష్

**తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి**



**మల్హర్,ఆగష్టు 01( జనం సాక్షి)** మండలంలోని తాడిచెర్ల టిఎస్ జెన్కో బొగ్గు గని డేంజర్ జోన్‌లో గృహాలను ప్రభుత్వం జరుపుతున్న సర్వేను పరిశీలించిన తాడిచెర్ల కాపురం టీఎస్ జెన్కో భూనిర్వాసితుల కమిటీ అధ్యక్షులు,తెలంగాణ ఈజిసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్,తాడిచెర్ల గ్రామ సర్పంచ్ బండి స్వామి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా దండు రమేష్ మాట్లాడుతూ దశబ్ద కాలంగా ఉపరితల బొగ్గు గనిలో బొగ్గు నిల్వలు వెలికి తీస్తున్న క్రమంలో దుమ్ము, దూలి, వెలువడుతున్న వివిధ రకాల గ్యాస్‌లకు ప్రజలు అనేక రోగాల బారిన పడినారు. బొగ్గు వెలికి తీసే క్రమంలో బ్లాస్టింగ్‌ల వల్ల అనేక ఇల్లు కూలిపోవడం జరిగింది. నిర్వాసితులు డేంజర్ జోన్ ప్రాంతం నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని గ్రామస్తులు చేసిన తొమ్మిది సంవత్సరాల నుండి పోరాటం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించి డేంజర్ జోన్ భూ నిర్వాసితుల సమస్యను ప్రభుత్వం ద్రుష్టికి తీసుకెళ్లి జిల్లా కలెక్టర్ ఖాతాలో డబ్బులు డిపాజిట్ చేయించారు. ఈ ప్రాంతంలో సర్వే చేస్తున్న సర్వే టీం అధికారులు పూర్వం నుండి నివాసముండే నిజమైన డేంజర్ జోన్ నిర్వాసితులను గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు. డేంజర్ జోన్ ప్రజలు సర్వే అధికారులకు సహకరించాలని ఎవరో చేస్తున్న ఫేక్ ప్రచారాలు నమ్మి అయోమయానికి గురికావద్దని అన్నారు. గ్రామపంచాయతీ రికార్డుల్లో లేని ఇళ్లను కూడా అధికారులు సర్వే చేస్తారని అని అన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అందరికీ న్యాయం చేయడానికి డేంజర్ జోన్ భూనిర్వాసితులు న్యాయ సహాయం కోసం నియమించుకున్న హైకోర్టు సీనియర్ లాయర్లు ఉన్నారని అన్నారు.

## కదిలి పాపహరేశ్వర స్వామిని దర్శించుకున్న ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్



**దిలావర్‌పూర్, ఆగస్ట్ 01, (జనం సాక్షి):** దిలావర్‌పూర్ మండలంలోని అత్యంత ప్రాచీన, ప్రాశస్త్యం గల కదిలి అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ మాత అన్నపూర్ణ సమేత శ్రీ పాపహరేశ్వర స్వామి ఆలయాన్ని భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల సీనియర్ డివిజనల్ మేనేజర్ పి. శివ నాగ ప్రసాద్ శనివారం సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణ దేవి చెంత కుంకుమార్చన చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ విశిష్టత గురించి తెలుసుకుని దర్శనానికి వచ్చానని శివ నాగ ప్రసాద్ తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు ఆలయ మర్యాదల ప్రకారం శాలువాతో సన్మానించారు. ఆలయ పూజారి శంకర్ స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ కె. మహేందర్, వికాసాధికారి వైద్య రవీందర్, నాయకులు సింధే దత్తురాం పాటిల్, మడేగాం సర్పంచ్ జాదవ్ మారుతీ రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# తరగతి గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు

## ఆరోగ్య పాఠశాల లక్ష్యాలను పక్కాగా అమలు చేయాలి:జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**మావల ఆగస్టు 02( జనం సాక్షి):** తరగతి గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు నిర్ణయించబడుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కేఆర్కే కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల, సిసి టివిల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసికట్టుగా కృషి చేసి ఆరోగ్య పాఠశాల లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యా సంవత్సరంలో ఉండే 220 పనిదినాలలో ప్రతి విద్యార్థి కనీసం 200 రోజులు ఖచ్చితంగా పాఠశాలకు హాజరు కావాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. పండుగలు, శుభకార్యాలకు కేటాయించిన సమయం మినహా, మిగతా రోజుల్లో క్రమం తప్పకుండా బడికి వస్తేనే ఎఫ్ఎల్ఎన్ మెరుగవడంతో పాటు పదో తరగతి ఫలితాలు, గురుకుల సీట్లు సాధించవచ్చని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచగలిగితే, జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ ప్రత్యేక సర్దుబాటు ద్వారా వంద శాతం మరొక అదనపు టీచర్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాల్లో ప్రాథమిక సామర్థ్యాలు పెంచేందుకు మధ్యాహ్నం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలను 'ఎఫ్.ఎల్.ఎన్ కాంపిటెంట్ పాఠశాల'గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. వీటితో పాటు ప్రతిరోజూ నిర్వహించే 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తూ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చాలన్నారు. విద్యార్థుల పోషకాహారం కోసం త్వరలోనే మధ్యాహ్న భోజనంతో పాటు హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు గుట్కా, గంజాయి, మద్యం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు బానిసలైన వారిని గుర్తించి రిమ్స్‌లోని 'డి-అడిక్షన్ సెంటర్' ద్వారా ఉచిత చికిత్స అందించాలని కోరారు. ప్రభుత్వం అందించే బ్లూ యూనిఫామ్‌లు పిల్లలకు సరిగ్గా కుదిరేలా ఎస్.హెచ్.జి టైలర్ల ద్వారా ఆల్టరేషన్ చేయించాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, అధికారులు ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలోని అంశాలపై పాటలు, ప్రసంగం, నాటికల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను కలెక్టర్ శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను రిబ్బన్ కట్ చేసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సీసీ కెమెరాలు విరాళంగా ఇచ్చిన దాతలు మౌనీష్, శ్రీకాంత్ సేవలను, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న హెచ్ఎం నవీన్, ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, కౌన్సిలర్లు రజిత, మాన్కర్ నాక్సేన్, ఆరోగ్య పాఠశాల పర్యవేక్షకులు అజయ్, కాంప్లెక్ హెచ్ఎం సాధన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ యాదవ్, ఏఏపిసి చైర్మన్ రజియా సుల్తానా, దాతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలనీ వాసులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నర్వాయిపేటలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు



**నెన్నెల, ఆగస్టు 1 (జనం సాక్షి)** నెన్నెల మండలం నర్వాయిపేట గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు, యువతతో పాటు సుమారు 50 మంది శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్వాయిపేట సర్పంచ్ కున్సోత్ నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జాడి రాజ్‌కుమార్, జలంపల్లి భాస్కర్, కొండగొర్ల గంగారాం, నాయకులు తారాచంద్, సుంకరి శ్రీనివాస్, గోలేటి సంధ్యారాణి, సింగతి తిరుపతి, ఉయ్యాల మల్లిక, గంగిరెడ్డి తిరుపతి రెడ్డి, మల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యం



**ఖానాపూర్ ఆగస్టు 01 (జనం సాక్షి)** పుట్టిన శిశువుకు మొదటగా తల్లి పట్టే ముర్రు పాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని 5వ వార్డు కౌన్సిలర్ మేస పోసమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని ఇంద్రానగర్ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిశువు పుట్టిన నాటి నుండి ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు పట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందన, హెల్త్ ఎడ్యుకేటర్ లత, ఏఎన్ఎంలు లావణ్య, శోభ, అంగన్వాడి టీచర్‌లు పుష్పలత, శోభారాణి, ఆశలు త్రివేణి, సునీత, నాయకులు మేస సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.70 కోట్లతో గోల్లపల్లి మైలారం బీటీ రోడ్డు పనులకు శ్రీకారం





**నెన్నెల, ఆగస్టు 1 (జనం సాక్షి )** నెన్నెల మండలంలోని జోగాపూర్ టీ రోడ్డు నుంచి మైలారం మత్తడి వాగు బ్రిడ్జి వరకు రూ.1.70 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాణ్యమైన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మైలారం, గోల్లపల్లి గ్రామాల ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామితో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బొమ్మెన హరీష్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు మల్లేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ కార్యదర్శి సుంకరి శ్రీనివాస్, మండల యువ కాంగ్రెస్ అధ్యక్షుడు కంపేల రాజశేఖర్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమర్థవంతమైన ప్రధానోపాధ్యాయులే పాఠశాల అభివృద్ధికి వెన్నెముక

## జిల్లా విద్యాశాఖ అధికారి అల్వాల సత్యనారాయణమూర్తి



**మహబూబాబాద్, ఆగస్టు 01(జనం సాక్షి):** సమర్థవంతమైన ప్రధానోపాధ్యాయులే పాఠశాల అభివృద్ధికి వెన్నెముక అని జిల్లా విద్యాశాఖ అధికారి అల్వాల సత్యనారాయణమూర్తి అన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ నేటి విద్యా వ్యవస్థలో ప్రధానోపాధ్యాయుడు కేవలం పరిపాలనాధికారి మాత్రమే కాకుండా, పాఠశాల అభివృద్ధికి దిశానిర్దేశం చేసే నాయకుడిగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సమర్థవంతమైన ప్రధానోపాధ్యాయునికి ఉండాల్సిన ముఖ్య లక్షణాలను వివరిస్తూ, స్పష్టమైన విజన్, నిజాయితీ, సమర్థవంతమైన కమ్యూనికేషన్, జవాబుదారీతనం, బృంద నిర్మాణం, సమస్య పరిష్కార నైపుణ్యం, వినూత్న ఆలోచనలు వంటి లక్షణాలు పాఠశాల విజయానికి అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ, విద్యార్థి కేంద్రిత బోధన, నిరంతర పర్యవేక్షణ, నాణ్యమైన అభ్యాస ఫలితాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో సానుకూల వాతావరణాన్ని నెలకొల్పి, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ సంఘం స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం పెంపొందించుకోవాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని మెరుగుపరచడంలో ప్రధానోపాధ్యాయులు నాయకత్వ పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో ఆచరణలోకి తీసుకువచ్చి, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సెంటర్ ఇంచార్జ్ మండల శ్రీరాములు. క్వాలిటీ కోఆర్డినేటర్ ఎం వెంకటేశ్వర్లు. సంతోష్.రిసోర్స్ పర్సన్లు, పూజారి వీరయ్య. విజయకుమార్. ప్రభాకర్. కళాధర్ మండల విద్యాశాఖ అధికారులు మరియు ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ గంగా ఉగ్రరూపానికి రహదారులు నిర్బంధం

## హుడ్కిలి, వెంకట్రావ్ పేట్, పారిగాం వంతెనలపై బారికేడ్లు



**సిర్పూర్ టి, ఆగస్టు 01 (జనం సాక్షి):** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా పెంగంగా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నది ఉధృతికి తోడు భారీగా వస్తున్న వరద నీరు, బ్యాక్‌వాటర్ ఎఫెక్ట్ మండలంలోని మూడు ప్రధాన రవాణా మార్గాలు పూర్తిగా దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారులపైకి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో రాకపోకలు స్తంభించి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. .ఇటు మహారాష్ట్ర-చంద్రాపూర్ సరిహద్దులోని హుడ్కిలి లో-లెవెల్ వంతెనను వరద నీరు పూర్తిగా ముంచెత్తింది. వెంకట్రావ్ పేట్ వంతెనపై నుండి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో తెలంగాణ-మహారాష్ట్రల మధ్య అంతరాష్ట్ర రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ముంపునకు గురైన రూట్లలో బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలను నిర్బంధించారు. ప్రవాహం ఎక్కువగా ఉన్నందున వాహనదారులు, ప్రజలు ఎవరూ కూడా వంతెనలు దాటే సాహసాలు చేయవద్దని, అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండల పంచాయతీ అధికారి వినోద్ కుమార్, ఏపిఓ చంద్రయ్య మరియు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు వరద ముంపునకు గురైన హుడ్కిలి, వెంకట్రావ్ పేట్ మరియు పారిగాం వంతెనలను స్వయంగా సందర్శించి పరిస్థితిని సమీక్షించి, మాట్లాడుతూ ప్రవాహం వైపు ప్రజలు ఎవరూ వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని అక్కడి గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.

## పత్తి, వరి పంటల క్షేత్రస్థాయి పరిశీలన

### రైతులకు శాస్త్రవేత్తల కీలక సూచనలు



**సిర్పూర్ టి , ఆగస్టు 01 (జనంసాక్షి )** కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సిర్పూర్ మండలంలో గల లక్ష్మీపూర్, టోశీ కీని , పారిగాం, లోనవెల్లి గ్రామాల్లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. మధు శనివారం పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో పత్తి, వరి పంటలను కాపాడుకోవడం అలనో ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు తగిన పద్ధతులను వివరించారు. నీటినిల్వ,పోషకాల పిచికారీ, ఎరువుల యాజమాన్యం, అంతరకృషి, వరి పంటలో కలుపు నివారణ, కలుపు మందు వాడకం, వీటిపైన రైతులకి కీలక సూచనలు చేశారు క్షేత్రస్థాయి పంటల పరిశీలన కార్యక్రమంలో సిర్పూర్ మండల వ్యవసాయ అధికారి బి. గిరీషన్, లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ రాందాస్ మరియు స్థానిక రైతు సోదరులు పాల్గొన్నారు.

## వరద ఉధృతి తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా జిల్లా ఎస్పీ నితికా పంత్



**కౌటాల ఆగస్టు 01జనం సాక్షి** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెన్‌గంగ, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కౌటాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది ప్రవాహాన్ని పరిశీలించి అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పెన్‌గంగ, ప్రాణహిత నదుల ఉధృతి దృష్ట్యా జిల్లా పోలీస్ శాఖ,ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రోప్‌లు, లైఫ్ బాయ్‌లు, లైఫ్ జాకెట్లు తదితర అత్యవసర రక్షణ సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.వరద ఉధృతి పూర్తిగా తగ్గిన తర్వాత మాత్రమే ప్రజల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే నదులు, వాగుల వద్దకు వెళ్లకుండా, ముఖ్యంగా చేపల వేట కోసం నదిలోకి దిగే సాహసం చేయవద్దని, భారీ వరద ఉధృతి నేపథ్యంలో పడవలు నడపరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, అధికారుల సూచనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు.ఈ పరిశీలనలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహీదుద్దీన్, కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్,ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు

### అణగారిన వర్గాల అభ్యున్నతికి

## అన్నాభావు సాటే కృషి ఆదర్శనీయం

### 106వ జయంతి వేడుకల్లో రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు



**గుడిహత్నూర్, ఆగస్టు 1(జనం సాక్షి)** అణగారిన వర్గాల హక్కులు, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాటే అని రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు అన్నారు. అన్నాభావు సాటే 106వ జయంతి సందర్భంగా శనివారం గుడిహత్నూర్ మండలంలోని లింగాపూర్ గ్రామంలో రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నాభావు సాటే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సత్యరాజ్ ఉపారపు మాట్లాడుతూ కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం కోసం అన్నాభావు సాటే చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన రచనలు 27 భాషల్లో అనువదించబడి, 18 దేశాల్లో గుర్తింపు పొందడం ఆయన సాహిత్య గొప్పతనానికి నిదర్శనమన్నారు. యువత మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు గణేష్ కాంబ్లే, ఓం కుమార్, గ్రామ పెద్దలు శ్రీరంగ్, రాహుల్, శివకుమార్, చంద్రశేఖర్, కేశవ్, భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత గడ్డి మందు పట్టివేత

### రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేయాలి డీసీపీ ఎ. భాస్కర్



**తాండూర్, ఆగస్టు 01(జనం సాక్షి)** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ తాండూర్ సర్కిల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశం లో మంచిర్యాల, ఎగ్గడి భాస్కర్ నిందితుల అరెస్ట్ వివరాలను వెల్లడించారు.నిందితుల వివరాలు:ఏ 1) గుండా రాజు, తండ్రి: కొమురయ్య, వయస్సు: 26 సంవత్సరాలు, కులం: మున్నూరు కాపు, వృత్తి: విద్యార్థి, నివాసం: అందవెల్లి గ్రామం, కాగజ్‌నగర్ మండలం.ఏ 2) పార్వతి కిరణ్, తండ్రి: సత్తయ్య, కులం: మున్నూరు కాపు, వృత్తి: డ్రైవర్, నివాసం: బట్టుపల్లి గ్రామం, కాగజ్‌నగర్ మండలం.ఏ 3) రుకుం వెంకటేష్, తండ్రి: పోశయ్య, వయస్సు: 36 సంవత్సరాలు, కులం: మున్నూరు కాపు, వృత్తి: వ్యవసాయం, నివాసం: వెంకటాపూర్ గ్రామం, భీమిని మండలం.ఏ 4) పల్లె రవీందర్, తండ్రి: భీమయ్య, వయస్సు: 36 సంవత్సరాలు, కులం: మున్నూరు కాపు, వృత్తి: వ్యవసాయం, నివాసం: వెంకటాపూర్ గ్రామం, భీమిని మండలం.స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు: క్రైమ్ నెంబర్ 50/2026 (పీస్ భీమిని, మొత్తం: 210 లీటర్ల గడ్డి మందు, మొత్తం విలువ రూ. 1,04,100/-, ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. రాంపూర్ గ్రామ శివారులోని ఎక్స్ రోడ్ వద్ద టొయోటా ఇన్నోవా కార్ (ఏపీ 15 ఏ వి 4488) మరియు వెంకటాపూర్ గ్రామ పరిసరాల్లో ద్విచక్ర వాహనాల్లో గడ్డి మందు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు నమ్మదిగిన సమాచారం అందడంతో, భీమిని ఎస్సై కోటేశ్వర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గడ్డి మందు ప్లాస్టిక్ క్యాన్లు, ప్యాకెట్లు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు మహారాష్ట్ర రాష్ట్రంలోని రాజురా పట్టణం నుండి ఈ గడ్డి మందులను కొనుగోలు చేసి, భీమిని మండల పరిధిలో రైతులకు అక్రమంగా విక్రయించేందుకు తీసుకొస్తున్నట్లు వెల్లడైందన్నారు గ్లైఫోసేట్ వంటి గడ్డి మందుల వాడకం వల్ల భూమి సారవంతం తగ్గిపోవడం, పంట దిగుబడి తగ్గడం, పర్యావరణానికి హాని కలగడం, రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ప్రభుత్వం అనుమతించిన, లైసెన్సు కలిగిన ఎరువులు మరియు పురుగుమందుల దుకాణాల నుంచే మందులు కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. దళారుల మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా గడ్డి మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ శ్రీ కిరణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాస్ రావు, తాండూర్ సీఐ దేవయ్య, భీమిని ఎస్సై కోటేశ్వర్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు దీకొండ రమేష్, లక్ష్మణ్ రావు, సిబ్బంది లవన్, రాజేందర్, మట్ట రమేష్, మైకాంత్, నీలిగొండ అంజయ్య, ముస్తఫా, రమేష్, కిరణ్ మరియు సుబ్బారావు పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తి గణాంక వివరాలను వెల్లడించిన జిఎం



**శ్రీరాంపూర్(జనంసాక్షి)ఆగస్టు 01 :** శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని సింగరేణి బొగ్గు గనులు జూలై నెలలో సాధించిన ఉత్పత్తి, రవాణా గణాంకాల వివరాలను ఏరియా జీఎం శ్రీనివాస్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.జులై నెల ఉత్పత్తి లక్ష్యం 4,11,500 టన్నులకు గాను 2,37,407 టన్నులు సాధించినట్లు,భూగర్భ గనులు 95% ఉత్పత్తి, ఉపరితల గనులు 42% ఉత్పత్తి సాధించాయి అన్నారు.జులై చివరి వారంలో వర్షాలు ఓసీ లలో కొంత మేర ఉత్పత్తిపై ప్రభావం చూపాయి అన్నారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం నిర్దేశించిన 64లక్షల 30 వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని ముందస్తు ప్రణాళికలతో అధిగమిస్తామన్నారు.వర్షాల నేపథ్యంలో ఓసీలలో పంపింగ్ వ్యవస్థ,భూగర్భ గనులలో రక్షణ విషయంలో అన్ని చర్యలు తీసుకున్నాం అన్నారు.56 వ వార్షిక భద్రతా పక్షోత్సవంలో శ్రీరాంపూర్ గనులు సత్తాచాటి వివిధ విభాగాలలో ఏకంగా 19 బహుమతులు సాధించాయని,ఎస్ఆర్పీ3 మొదటి బహుమతి సాధించి ఏరియాకు గర్వకారణంగా నిలిచింది అన్నారు.అన్ని గనులలో రక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఏజెంట్లకు ప్రత్యేక సూచనలు చేయటం జరిగింది అని తెలిపారు.ఏరియాలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు 3856 మందికి డిపెండెంట్ ఉద్యాగాలు కల్పించటం జరిగిందని,281 మంది ఉద్యోగులకు ఎల్ఎస్‌పీ చెల్లింపు, 30మందికి ఎంఎంసీ చెల్లించటం.ఉద్యోగ విరమణ పొందిన 9773 మంది ఉద్యోగులకు సిపిఆర్ఎంఎస్ క్రింద ఇప్పటి వరకు మెడికల్ కార్డులు అందజేశామన్నారు.

## మహిళా మూర్తులకు ప్రత్యేక గ్రామ సభ: సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్



**తాండూర్, ఆగస్టు 01(జనం సాక్షి )** మంచిర్యాల జిల్లా, తాండూరు మండలం, మాదారం గ్రామపంచాయతీలో మహిళలకు ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం జరిగింది. గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామ సభకు గ్రామపంచాయతీలోని మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ప్రత్యేక గ్రామసభలో "సర్ " ( ఎస్ ఐ ఆర్ ) విధులలో భాగంగా బి.ఎల్.ఓ గా సమర్థవంతంగా విధులు నిర్వహించిన నడిపెల్లి యాదలక్ష్మి శాలువాతో ఈ సభలో తోటి మహిళల చేత సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ మహిళల కోసం జరుగుతున్న ఈ ప్రత్యేకమైన గ్రామసభ యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే మహిళలందరూ కూడా అన్ని రంగాలలో ముందు ఉండాలని అన్నారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిగా ఉపయోగించుకుంటూ దేశ భవిష్యత్తుకు మహిళామూర్తులందరూ బంగారు బాటను వేయాలని తెలియజేశారు. మహిళలందరూ కూడా ఉన్నతమైన చదువులు చదువుకొని కుటుంబం మరియు దేశ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. అంతేకాక పురుషులతో సమానంగా,మహిళలు అన్ని రంగాలలో కూడా ముందు ఉండి స్వతంత్రమైన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉన్నతమైన చదువు ఉండాలని దీనిద్వారా లింగ వివక్షతన దూరం చేయడమే కాకుండా, చట్టపరమైన రక్షణ మరియు భద్రత లభిస్తుంది అని తెలియజేశారు. స్వయం సహాయక సంఘాల ( ఎస్ జి హెచ్) ద్వారా మహిళా సాధికారత సాధించుకోవచ్చని తెలియజేశారు. మీరు చేసుకునే పొదుపుల ద్వారా సమాజంలో ఆర్థికంగా నిలదుక్కుకోవడానికి ఉపయోగపడతాయని అందువల్ల ప్రతి ఒక్కరూ వీటి ద్వారా పొదుపు అలవాట్లను పెంపొందించుకోవాలని తెలియజేశారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మీరు పొదుపు చేసుకునే డబ్బులతో రుణాలు పొందడం, కుటుంబ అవసరాలు తీర్చుకోవడం మరీ ముఖ్యంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి ,వార్డు సభ్యులు గొర్లపల్లి బాణేష్, మీసా లలిత, పొట్లంచర్ల సౌమ్య, గుండేటి లక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ శ్రీలత, ఉపాధి హామీ మేట్ పుప్పాల పుష్ప, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు తోటపద్మ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పేరు మాధవి స్వయం సహాయక సంఘం నాయకురాలు కోళ్ల జ్యోతి అంగన్వాడి టీచర్ కుసనపల్లి మీనా యాదలక్ష్మి మరియు స్థానిక గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అన్నా భౌ సాటే జయంతి వేడుకలు

### భోస్ర గ్రామ సర్పంచ్ జి సుభాష్



బజార్హత్నూర్( జనం సాక్షి):-మండలంలోని భోస్ర గ్రామంలో శనివారం రోజునా మహనీయుడు అన్నా భౌ సాటే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి. సుభాష్ మాట్లాడుతూ మహనీయుడు అన్నా భౌ సాటే సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజాకవి, రచయిత, సామాజిక సంస్కర్త అని కొనియాడారు. ఆయన రచనలు సమానత్వం, సామాజిక న్యాయం, మానవ విలువలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని, విద్య, ఐక్యత మరియు సేవా భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహనీయుల జయంతులు వారి జీవిత సందేశాలను గుర్తు చేసుకుని ఆచరణలో పెట్టేందుకు ఒక మంచి అవకాశం అని పేర్కొన్నారు, వెనుకబడిన మాంగ్ సమాజ్ అభివృద్ధికై ప్రత్యేక మాంగ్ సమాజ్ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని, పిల్లలు చదువుకోవడానికి గురుకులాల్లో ప్రత్యేక సీట్లు కేటాయించాలి, ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యతనివ్వాలి, రిజర్వేషన్లో న్యాయం చేయాలి, మాంగ్ సమాజ్ మహనీయులను తగిన విధంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి. పరశురామ్ (మంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షులు), ఉప సర్పంచ్ ప్రసాద్, వార్డ్ సభ్యులు దత్తరి, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. వక్తలు అన్నా భౌ సాటే జీవితం, సాహిత్య సేవలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన విశేష కృషిని స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మంత్రిపై దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి



రామకృష్ణాపూర్, ఆగస్ట్ 01(జనంసాక్షి): క్యాతనపల్లి మున్సిపాలిటీలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు స్థానిక ఏడవ వార్డు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వద్ద ఉన్న కల్వర్టు వరద ప్రవాహానికి కొట్టుకుపోవడంతో పరిశీలించిన రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాటలను సోషల్ మీడియా వేదికగా వక్రీకరించిన బిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పొద్దాల శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి యాకూబ్ అలీ, నాయకులు మెట్ట సుధాకర్ మండిపడ్డారు. స్థానిక నాయకులతో కలిసి శనివారం కల్వర్టును పరిశీలించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. చెన్నూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మంత్రి వివేక్ వెంకటస్వామి నిరంతరం నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. స్థానిక ఏడవ వార్డుతో పాటు గద్దెరాగడి, దుబ్బపల్లి గ్రామ ప్రజలకు సౌకర్యార్థంగా కల్వర్టు నిర్మించి సర్వీస్ రోడ్ ఏర్పాటు కొరకు నివేదికను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం కొరకే మంత్రి ఫోటో ప్రేరణ పై ప్రత్యేకంగా మాట్లాడినట్లు గుర్తు చేశారు. పాలకవర్గంలో ఉన్న చైర్మన్, బిఆర్ఎస్ కౌన్సిలర్లు అభివృద్ధిపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి మంత్రితో చర్చలు జరపాలే తప్ప అసత్య ప్రచారాలు చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేయొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, బీమా మల్లేష్, కూతురు ప్రభాకర్, దాముఖ శిరీష, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నాయకులు పొలం సత్యనారాయణ, శ్రీనివాస్, గోపురాజం, సత్యనారాయణ, ప్రేమ్ సాగర్, శివ, మహిళా నాయకురాలు సృజన, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# జైలు బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న

గూడూరు,ఆగస్టు01(జనంసాక్షి):
రైతు కార్మిక కర్షక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాలు తప్పవని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకన్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.శనివారం గూడూరు మండల కేంద్రంలో సిఐటియు రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సదస్సు నానబాల పురుషోత్తం అధ్యక్షతన సమావేశం జరిగినది.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా శెట్టి వెంకన్న హాజరై మాట్లాడుతూ కేంద్రంలో హాట్రిక్ కొట్టి అధికారంలోకి వచ్చిన బిజెపి కార్మిక రైతులు,కర్షకులు పోరాడి సాధించుకున్న చట్టాలను తొలగించి ప్రజలను పోరాటంలోకి రాకుండా బీజేపీ అడ్డుపడుతుందని వారు విమర్శించారు. వామపక్షాల పోరాట ఫలితంగా ఉపాధి హామీ చట్టాన్ని సాధించడం జరిగిందనీ,ఆ చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో విబి జి రాంజీ పథకాన్ని తీసుకురావడం అంటే కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకుంటుందని అయన పేర్కొన్నారు. స్వాతంత్రం అనంతరం భారతదేశములో హరిత విప్లవం జయప్రదం చేసేందుకు గత పాలకవర్గాలు ప్రయత్నిస్తే, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చే సబ్సిడీలను తగ్గించి, ఎరువుల ధరలను పెంచి, ఎరువులకు ఇచ్చే సబ్సిడీలు కూడా పూర్తిస్థాయిలో తొలగించి రైతులపై భారాలను మోపుతుందని వారు విమర్శించారు.విద్యుత్ సౌరణ చట్టం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చి రైతులకు ప్రజలకు విద్యుత్ నుండి తొలగించే పద్దతిలో చట్టంలో మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించిన 34 లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చి,కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. ఈనెల 10న జరిగే జైలు బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్క సైదులు,సిఐటియు జిల్లా నాయకురాలు పగిడిపాల తిరుపతమ్మ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చారి,సిఐటియు నాయకులు వీరెల్లి మల్లేశం, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు చెల్పూరి శ్రీశైలం,గ్రామపంచాయతీ సిబ్బంది బత్తుల వెంకన్న, ఆశ వర్కర్స్,అరుణ, సోమేశ్వరి,ఐకెపి వివో ఏ రాజు,మౌలానా, తదితరులు పాల్గొన్నారు.



# పే స్కేల్ అమలు చేయాలని వీబీజీ రాంజీ ఉద్యోగుల నిరసన

### ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్






కెరమెరి,ఆగస్టు1 (జనంసాక్షి) కెరమెరి మండలం వీబీ జీ రాంజీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, పే స్కేల్ అమలు చేయాలని మండల వీబీ జీ రాంజీ కార్యాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. శుక్రవారం నుంచి చేపట్టిన పెన్ డౌన్, షట్ డౌన్ కార్యక్రమంలో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గత నెల 29 నుంచి దశల వారిగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఉద్యోగులు తెలిపారు. ఈనెల 4 వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీబీ జీ రాంజీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుత, ప్రజాస్వామ్యబద్ధమైన విధానంలో నిరసనలు తెలుపుతున్నామని తెలిపారు. వీబీ జీ రాంజీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, సేవా నిబంధనలు, వేతనాలు, ప్రమోషన్లు, ఇతర హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఏపీవో మల్లయ్య, టిఏ లు నాగోరావ్, మహేందర్, ధరంసింగ్ తదితరులు పాల్గొన్నారు. నిరసన తెలుపుతున్న ఉద్యోగులు.

# కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా బైక్ చోరీలు

- పాల్పడుతున్న నిందితుడిని కాజీపేట పోలీసులు అరెస్టు చేసారు
- కేసు త్వరగా ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించారు : ఏసీపీ ప్రశాంత్



కాజీపేట ఆగస్టు: 1(జనం సాక్షి) కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని కాజీపేట పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గత కొంతకాలంగా జరుగుతున్న బైక్ చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని సేకరించి నిందితుడిని గుర్తించారు. కాజీపేట సీ.ఐ శ్యామ్‌సుందర్ ఆదేశాల మేరకు ఎస్ఐ బి శివ, ఎస్ఐ మౌనికా రెడ్డి, ఎస్ఐ యాదగిరి, క్రైమ్ టీమ్ సభ్యులు వీ. క్రాంతికుమార్, జీ. కుమారస్వామి తమ బృందంతో కలిసి పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. నిరంతర నిఘా, కఠినమైన శ్రమ, అప్రమత్తతతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి కేసును త్వరగా ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించారు. నేరాల నియంత్రణలో భాగంగా కాజీపేట పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రత కోసం నిరంతరం. కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రజలు తమ వాహనాలను సురక్షితమైన ప్రదేశాల్లో ఉంచాలని, వాహనాలకు తాళాలు వేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కేసును త్వరగా ఛేదించి, చోరీ కి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందించారు.

### పోలీస్ వారి హెచ్చరిక!

రైల్వే స్టేషన్ చుట్టుప్రక్కల అనధికారికంగా మోటార్ పార్కింగ్ చేయరాదు. ఒకవేళ చేసినచో వాహనం సీజ్ చేయబడును మరియు చట్టపరమైన చర్యలు తీసుకోబడును. దుకాణాల ముందు మరియు ఇంటి ముందు సరిగ్గా జాగ్రత్త తీసుకోకుండా టూ వీలర్ పార్కింగ్ చేస్తే దొంగతనం జరిగే అవకాశం ఉంది, కావున జాగ్రత్త పడగలరు. ఈ కార్యక్రమంలో కాజీపేట పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం



గోవిందరావుపేట: ఆగస్ట్01 (జనం సాక్షి)తల్లిపాల వారోత్సవాలు పస్రా ఫోర్ వడ్డెర గూడెం అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ర్యాలీ తీయడం జరిగింది. దీనిని ప్రతి సంవత్సరం ఆగస్టు నెల ఒకటవ తేదీ నుండి ఏడవ తేదీ వరకు ఈ వారం రోజులు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. పుట్టిన ప్రతి బిడ్డకు ఒక గంటలోపు తల్లిపాలు ఇవ్వాలి మొదట వచ్చే పాలను ముర్రుపాలు అంటారు. అవి చాలా చిక్కగా పసుపు రంగులో ఉంటాయి అవి బిడ్డ త్రాగడం వలన వ్యాధి నిరోధక శక్తి వస్తుంది. తల్లి బిడ్డకు అనుబంధం ఏర్పడుతుంది.తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదు తల్లికి గర్భ శయం యధా స్థానంలోకి వస్తుంది.దీని వలన బిడ్డకు బిడ్డకు మధ్య ఎడమ పెరుగుతుంది. ఈ కార్యక్రమంలో పస్రా 4 అంగన్వాడీ టీచర్ పద్మారాణి, ఆయా రాజ్యం తల్లులు పాల్గొన్నారు.వడ్డెర గూడెం అంగన్వాడీ కేంద్రంలోఎ ఎన్ ఎం సంపూర్ణ,అంగన్వాడి టీచర్ భాగ్యమ్మ,ఆయా కల్పన ఆశ వర్కర్ రమణమ్మ తల్లులు గ్రామస్తులు పిల్లలు పాల్గొన్నారు.

## పరకాల ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమా?

### బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్



**పరకాల, ఆగస్టు 1, (జనం సాక్షి):** పరకాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మిస్తున్న 100 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రిని ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినప్పటికీ నేటికీ ప్రారంభించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. అలాగే పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయానికి అందుబాటులో లేకపోవడం, పర్యవేక్షణ లోపించడం వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా సరైన వైద్య సేవలు అందక ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రభుత్వం ఇకనైనా స్పందించి వెంటనే 100 పడకల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది విధుల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో పరకాల ప్రజల తరఫున భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు.

## గీతన్నల చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయండి

### మండల అధ్యక్షులు పానుగంటి వీరాస్వామి



**గూడూరు,ఆగస్టు01(జనంసాక్షి):** నేడు మానుకోట జిల్లా కేంద్రంలో ఆర్తి గార్డెన్లో జరిగే గీతన్నల చైతన్య బస్సు యాత్రకు జిల్లాలోని గీత కార్మికులు వేలాదిగా తరలి రావాలని మండల అధ్యక్షులు పానుగంటి వీరాస్వామి పిలుపునిచ్చారు. శనివారం గూడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరాస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ,రూ.4000వేల పెన్షన్ ఇవ్వాలని,రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాదానికి గురైన గీత కార్మికుడికి 10లక్షలు ఎక్స్గ్రేషియా అందజేయాలని,50 సంవత్సరాలు నిండిన గీత కార్మికుడికి పెన్షన్ ఇవ్వాలని అన్నారు.ప్రతి జిల్లాలో తాటి,ఈత,ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని,తాటి,ఈత, చెట్లను నరికిన వారిని కఠినంగా శిక్షించాలని, ఏజెన్సీలో వృత్తి చేసే గీత కార్మికులందరికి సభ్యత్వంతో పాటు టిఎఫ్టిలు,సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అన్నారు. ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ట్యాంకు బండపై విగ్రహం ప్రతిష్టించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.ఈసమావేశంలో ప్రధాన కార్యదర్శి కుంజాల వీరాస్వామి,జిల్లా కమిటీ మెంబర్ వడ్లకొండ యాకయ్య,సభ్యులు బీమగాని యాదగిరి, బీమగాని రాహుల్, పాల్గొన్నారు.

## చట్టాలు తెలిసినప్పుడు నేరాలు అదుపులో ఉంటాయి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్ కుమార్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** చట్టాలు తెలిసినప్పుడు నేరాలు అదుపులో ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్పొరేషన్ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్ లో న్యాయ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. 102 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులతో జరిగిన ఈ న్యాయ అవగాహనా సదస్సుకు ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ స్కీం వివరించారు. పోక్సో నేరాలు అదుపుచేయడంలో, బాల్య వివాహాలు నిర్మూలించడంలో, బాల కార్మిక వ్యవస్థకు అడ్డుకట్ట వేయడంలో ఉపాధ్యాయులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి అఖిల, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె సురేష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె అక్షయ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కె.దామోదర్, న్యాయవాదులు వి శ్రావణ్ రావు, మంగళపల్లి రాజకుమార్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ వొకేషనల్ అండ్ పారామెడికల్ కళాశాలలో గోరింటాకు ఉత్సవం




**నర్సంపేట ఆగస్టు 1 ( జనంసాక్షి)** నర్సంపేట పట్టణంలోని ఎస్ఆర్ వొకేషనల్ అండ్ పారామెడికల్ కళాశాలలో శనివారం గోరింటాకు (మెహంది) ఫెస్టివల్ అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది విద్యార్థినులు, అలాగే ఎన్ ఎస్ ఎస్ యూనిట్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రమంలో విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, అందమైన మెహంది డిజైన్లతో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించారు. ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకుంటూ స్నేహభావాన్ని, ఆనందాన్ని పంచుకున్నారు. కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుని అందరినీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీ కొయ్యడి సనత్ కుమార్ మాట్లాడుతూ, "గోరింటాకు భారతీయ సంస్కృతికి ప్రతీక. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఐక్యత, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయి. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు చురుకుగా పాల్గొనడం వారి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుంది. మన సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని అన్నారు. విజేతలకు బహుమతులు అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ పారా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కొయ్యడి శిరీష, డైరెక్టర్ కొయ్యడి సరళ, వైస్ ప్రిన్సిపాల్ అజ్మీరా సూరయ్య, అధ్యాపకులు వరగంటి సందీప్, వరగంటి శ్వేతా, శతారసి కుమార్, జి. హరిబాబుషణ్, బి. వెంకన్న, ఎన్. రమేష్ నాయక్, డి. నాగేష్, ఎస్.కె. నజీమా తదితరులు పాల్గొన్నారు.

## బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి : వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఐపీఎస్



**సంగెం మండలం, ఆగస్టు 01( జనం సాక్షి)** వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్, ఈస్ట్ జోన్ పరిధిలోని సంగెం పోలీస్ స్టేషన్ ను శనివారం తనిఖీ చేశారు.ఈ ఉదయం సంగెం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్, సంగెం ఎస్.ఐ వంశీ కృష్ణ మొక్కలను అందజేసి స్వాగతం పలికగా, సాయుధ పోలీసుల గౌరవవందనం స్వీకరించి పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటి స్టేషన్ పరిసరాలు,స్టేషన్ సిబ్బందికి సంబంధించిన కిట్( పోలీస్ శాఖ సిబ్బందికి వ్యక్తిగతంగా మంజూరు చేసిన సామాగ్రి)తో పాటు స్టేషన్ కు సంబంధించిన రికార్డులు, స్టోర్ గదులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశం నిర్వహించి శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల స్వభావం, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ తదితర అంశాలపై స్టేషన్ ఎస్. ఐని పోలీస్ కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, బాధితునితో మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. వారి సమస్యలను పూర్తిగా తెలుసుకొని చట్టబద్ధంగా, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, భద్రత, భరోసా పెంపొందేలా పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని.కమ్యూనిటీ పోలీసింగ్కు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని విధుల నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావు ఉండకూడదని, పారదర్శకంగా, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని సూచించారు. డయల్-100 కాల్స్పై వేగంగా స్పందించి సంఘటన స్థలానికి వెంటనే చేరుకొని బాధితులకు మెరుగైన సేవలు అందించాలని సీపీ ఆదేశించారు.సిబ్బందికి వ్యక్తిగతంగా లేదా విధుల పరంగా ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పుడైనా తన దృష్టికి తీసుకురావాలని పోలీస్ కమిషనర్ సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీల్లో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఏసీపీ వెంకటేష్,పర్వతగిరి సిఐ రాజగోపాల్, సంగెం, పర్వతగిరి, ఐనవోలు ఎస్.ఐలు వంశీ కృష్ణ, ప్రవీణ్, అశోక్ కుమార్ తో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీబీజీ రామ్‌జీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా



**మహబూబాబాద్, ఆగస్టు 01 (జనం సాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తూ, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అజీవికా మిషన్ (వీబీజీ రామ్జీ) ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. పే స్కేల్ అమలు చేయడంతో పాటు పెండింగ్ వేతనాలు విడుదల చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని జెఏసి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అజీవికా మిషన్ (వీబీజీ రామ్జీ) ఉద్యోగులు జెఏసి ద్వారా నిరసన వ్యక్తం చేశారు. పే స్కేల్ అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వీబీజీ రామ్జీ జేఏసీ జిల్లా చైర్మన్ పార్థసారధి మాట్లాడుతూ... గత 20 ఏళ్లుగా సేవలందిస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులను ప్రభుత్వం ఇప్పటికీ క్రమబద్ధీకరించకపోవడం బాధాకరమన్నారు. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో తాము కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, తగిన వేతనం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గత 20 సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న నేటి వరకు ఉద్యోగ భద్రత కానీ సరియైన సమయానికి వేతనం లేదు కనీస వేతనం లేదు ప్రతి రోజు టార్గెట్స్ రివ్యూ చేస్తున్నారు తప్ప మా సంక్షేమం గురించి ఆలోచించనందున తప్పనిసరి వీధిలేక ఈ కార్యక్రమాలని నిరసనని కొనసాగిస్తున్నాం. జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెఏసి కన్వీనర్స్ ఎల్ల యాకాంబరం, బస్సీలాల్, క్రిష్ణ, కీర్య, రంజిత్, జిల్లా కార్యాలయ సిబ్బంది మరియు అన్ని మండలాల ఎ పి ఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ టెక్నికల్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

### సర్పంచ్ ముద్దం సాంబయ్య



**ఆత్మకూర్,ఆగస్టు 1 (జనం సాక్షి):** ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అక్కంపేట ముద్దం సాంబయ్య అన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో శుక్రవారం రాత్రి వికాస తరంగిణి ఆధ్వర్యం లో చిన్న జీయర్ స్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శ్రీరామ హృదయం కార్యక్రమం జరిగింది. కలశం పూజ నిర్వహించి శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం అనుసంధానం చేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి బాధ్యులు, అక్కంపేట భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# శంకుస్థాపనలకే కాదు.. గడువులోపు పనులు పూర్తి చేయడమే మా లక్ష్యం

- ప్రతి డివిజన్ అభివృద్ధే ధ్యేయం.. ప్రజల సహకారంతో వరంగల్ పశ్చిమను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- రూ.1.49 కోట్లతో 49వ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే నాయిని



**కాజీపేట ఆగస్టు: 1 (జనం సాక్షి)** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 49వ డివిజన్ పరిధిలో సుమారు రూ.1.49 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, తాము కేవలం శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఏర్పాటు చేసే రాజకీయాలకు పరిమితం కాదని, ప్రతి పనిని నిర్దిష్ట గడువులో పూర్తి చేయించడమే తమ లక్ష్యమని అన్నారు. వారం, పది రోజులు లేదా నెల రోజులకు మించకుండా పనులను పూర్తి చేసేలా అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే నాయిని,తాను ఎన్నికైన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నానని చెప్పారు. ప్రతి డివిజన్‌కు కోట్ల రూపాయల అభివృద్ధి నిధులను కేటాయించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి రుణపడి ఉన్నానని, ఆ రుణం తీర్చుకునేందుకు అంకితభావంతో పనిచేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల సహకారం ఎంతో అవసరమని, సమస్యలు ఎదురైనప్పుడు రాజకీయాలకు అతీతంగా వాటి పరిష్కారానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు ఇచ్చే సలహాలు, సూచనలను స్వాగతిస్తూ వాటిని పరిగణనలోకి తీసుకుని మరింత మెరుగైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బకాయిలు చెల్లించని మిల్లర్లపై ఆర్ఆర్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి

## హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి




**హనుమకొండ, ప్రతినిధి ఆగస్టు 1 (జనం సాక్షి) :**హనుమకొండ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు అప్పగించడంలో ఎలాంటి జాప్యం ఉండరాదని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సీఎంఆర్ డెలివరీ మానిటరింగ్ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 2025--26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీల పురోగతిని సమీక్షించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ, కేటాయించిన రైస్ మిల్లులను మానిటరింగ్ అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి, మిల్లులు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. మిల్లులు రోజుకు ఎన్ని గంటలు పనిచేస్తున్నాయి, ఎంత పరిమాణంలో ధాన్యం మిల్లింగ్ చేస్తున్నాయి, ఇప్పటివరకు ఎంత మేర సీఎంఆర్ సిద్ధం చేసి ఎఫ్‌సీఐకి అందజేశాయనే వివరాలను ప్రతిరోజూ తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని మానిటరింగ్ అధికారులు, సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా యాక్షన్ ప్యాడీకి సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని సూచించారు. డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టం ప్రకారం చర్యలు చేపట్టి, ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూళ్ల కోసం వారి ఆస్తులను జప్తు చేసే ప్రక్రియను సంబంధిత తహసీల్దార్లు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వానికి సంబంధించిన సీఎంఆర్ డెలివరీల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, ఎఫ్‌సీఐ ప్రొక్యూర్ మెంట్ మేనేజర్ ప్రసన్న కుమార్, సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సీఎంఆర్ డెలివరీ మానిటరింగ్ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# ఉద్యమ జేఏసీ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగం కల్పించాలి

- మానుకోట జిల్లా జేఏసీ చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణకు వినతిపత్రం అందజేత
- గూడూరు ఉద్యమ గాయకుడు పెరుమాండ్ల శ్రీనివాస్



**గూడూరు,ఆగస్టు01(జనంసాక్షి):** ఉద్యమ జేఏసీ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగం కల్పించి వారిని ఆదుకోవాలని గూడూరు ఉద్యమ గాయకుడు పెరమాండ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మానుకోట జిల్లా కేంద్రంలో నలంద డిగ్రీ కళాశాలలో జిల్లా జేఏసీ చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యమ జేఏసీ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు సహకరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యమ గాయకుడు పెరుమాండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో జిల్లా జేఏసీకి అనుసంధానంలో ఉద్యమ కళాకారుల జేఏసీ జిల్లా కన్వీనర్ కంబాలపల్లి సత్యనారాయణ,గూడూరు మండల జేఏసీ కన్వీనర్ డాక్టర్ అంబాల అంబరీష్. ఆధ్వర్యంలో ఆనాటి రాష్ట్ర జేఏసీ చైర్మన్ ప్రస్తుత ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆదేశాల మేరకు మానుకోట జిల్లాతో పాటు గూడూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలని తపనతో కళాకారులు గల్లి నుండి ఢిల్లీ వరకు కాలుకు గజ్జగట్టి గోసి గొంగడి వేసి సంకన డప్పులు వేసి ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేసి,మలిదశ తెలంగాణ ఉద్యమానికి కుటుంబాలకు దూరంగా ఉంటూ,తెలంగాణ రాష్ట్రం సాధనే ధ్యేయంగా తమ ఆటపాటలతో అలుపెరుగని పోరాటం చేసిన రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ముందు వరుసలో నిలిచిన కళాకారులకు ఈ ప్రజాపాలన ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకటించిన సందర్భంగా నికార్స్ అయిన ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగం అవకాశం కల్పించి,మిగతా కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేందుకు ఉద్యమకారుల కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం సార్ కు తెలియజేసి ఆనాడు జేఏసీకి వెన్ను తట్టి ఉన్న కళాకారులకు పారదర్శకంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సహకరించాలని మానుకోట జేఏసీ చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణకు తెలియజేశారు.

# నర్సింగ్ ఆఫీసర్‌ల సస్పెన్షన్ ఎత్తివేయాలి లేకుంటే విధులను బహిష్కరిస్తాం

## నేరుగా సస్పెన్షన్ చేయడం దుర్మార్గం సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ దుర్గా లోకేశ్వరి



**కమలాపూర్, ఆగస్టు 01 (జనం సాక్షి) :-** బన్నువాడ ఏరియా ఆసుపత్రిలో కొద్ది రోజుల క్రితం ఇటీవల ఐదుగురు బాలింతలు అస్వస్థతకు గురైన విషయంలో నర్సింగ్ ఆఫీసర్ లను నేరుగా సస్పెన్షన్ చేయడం దుర్మార్గం అని సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ దుర్గా లోకేశ్వరి అన్నారు. శనివారం కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. నిరసన తెలుపుతున్న నర్సింగ్ ఆఫీసర్ లకు సూపరింటెండెంట్ డాక్టర్ చందు నాయక్ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గా లోకేశ్వరి మాట్లాడుతూ బాలింతల కేసు విషయంలో నర్సింగ్ ఆఫీసర్‌లను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా కండిస్తున్నామన్నారు. సిబ్బంది వల్ల ఏదైనా తప్పు జరిగితే ముందుగా మెమో ఇవ్వాలిగాని సస్పెండ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలతో నర్సింగ్ వృత్తికి రావాలంటేనే భయపడే పరిస్థితినీ ఉన్నతాధికారులు తీసుకువస్తున్నారనియు ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెన్షన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేదంటే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవి,అపర్ణ,స్వప్న,ప్రణీత,స్నేహ,వరుణ్ మాధవ్,ప్రవణ్య నర్సింగ్ ఆఫీసర్‌లు స్వప్న, నెబ్లా,సరిత,సుమన్, షీబా,అనిత కుమారి,అనిత,కళ్యాణి, బ్యూలా సులోచన, రజిత, ఫార్మసిస్ట్ సుశ్రిత, జూనియర్ అసిస్టెంట్ శివ కార్తీక్, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతిని చాటిన ఆదర్శ హైస్కూల్ బోనాల వేడుకలు




**కాటారం ఆగస్టు 1 (జనం సాక్షి):** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కాటారం మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మట్టి కుండల్లో బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శివశక్తుల పూనకాల మధ్య పాఠశాల నుంచి లక్ష్మీదేవర ఆలయం వరకు భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. బోనాల పాటలకు సాంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు, బోనాల పండుగ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం



**ఆత్మకూర్,ఆగష్టు 1 (జనం సాక్షి):** ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు సర్పంచ్ సయ్యద్ మౌలా తెలిపారు.. శనివారం హౌజ్ బుజుర్గ్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించగా ఈ సందర్భంగా సర్పంచ్ మౌలా పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీల్లో పిల్లలను చేర్పించాలని అన్నారు. తల్లిపాలతో శిశువు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, అంగన్వాడిల్లో ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ రమాదేవి, ఏఎన్ఎం, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ కడియం కావ్య



**నల్లబెల్లి, ఆగస్టు 01 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను వరంగల్ ఎంపీ కడియం కావ్య శనివారం పరామర్శించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా పెద్ది కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మహిళా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్



**రాయపర్తి,ఆగస్టు 1(జనంసాక్షి):** సేవే పరమో ధర్మం అనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది.రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచనల మేరకు,రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎండీ అబ్బాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా,ఆయన కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం,ఒక ఆయిల్ క్యాన్ అందజేసి అండగా నిలిచారు.కుటుంబానికి అవసరమైన ప్రతి సందర్భంలో తాము తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల నాయకులు లేతకుల రంగా రెడ్డి,కర్ర రవీందర్ రెడ్డి,చిట్యాల వెంకన్న,సంకినేని ఎల్లస్వామి,ఎండీ అన్వార్,మొర్రి రాజేందర్,ముద్రబోయిన శ్రీనివాస్,ఎండీ కలీల్,ఎండీ నాసర్,చిడిమిళ్ల అశోక్,బూడిద సోమయ్య,బూడిద శ్రీధర్,బూడిద యాకయ్య,వెలుపుగొండ బిక్షపతి,కందుకూరి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలో 640 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రారంభం

### జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ఈపి ప్రేమలత.



**ములుగు ప్రతినిధి,ఆగస్టు 01(జనంసాక్షి).** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు(ఆగస్టు 1-7) ములుగు జిల్లాలోని 640 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ (అంగన్‌వాడీ) సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. రాబోయే 10 రోజుల పాటు షగ్ ఎస్ హెచ్ జి సమాఖ్య సంఘాల మహిళలకు, అలాగే డిగ్రీ, నర్సింగ్ మరియు మెడికల్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయి. అదేవిధంగా ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా వివిధ అవగాహన కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టబడతాయి. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు, పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, తల్లి మరియు శిశువు ఆరోగ్యానికి తల్లిపాల ప్రాధాన్యత, సరైన పోషకాహారం, శిశు సంరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించబడుతుంది. ములుగు జిల్లాలో ప్రస్తుతం 1,429 మంది గర్భిణులు మరియు 682 మంది బాలింతలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరితో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా చురుకుగా పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి ఈపీ ప్రేమలత మరియు సంబంధిత అధికారులు కోరారు.

## మొగుళ్ళపల్లి వీజీలో సీట్ల కేటాయింపులో అధికారుల ఇష్ట రాజ్యం

- అంత పై అధికారులు ఎవరికి సీటు ఇవ్వమంటే ఇస్తున్న అని సమాధానం ఇచ్చిన ప్రిన్సిపాల్
- తక్షణమే ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులుపై చర్యలు తీసుకోవాలనిడిమాండ్



**మొగుళ్ళపల్లి జనం సాక్షి ఆగస్టు 01:** మండల కేంద్రంలోని ఈరోజు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మొగుళ్ళ పల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల ముందు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఛాదీవూ ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్ కుమార్ మాట్లాడుతూ ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాలతో పాఠశాలలో పరీక్ష రాసిన రాయుకున్న సీట్లు కేటాయిస్తున్నానని, తెలియజేయడం విడ్డూరమన్నారు, బ్యాక్లాగ్ సీట్లను పరీక్ష ద్వారా భర్తీ చేయకుండా మా అధికారులు చెప్తేనే సీట్లు ఇస్తున్నానే ప్రిన్సిపాల్ చెప్పడం హాస్యాస్పదమన్నారు, ఈ సందర్భంగా సమాచార నిమిత్తం పోలీసుల సమక్షంలో ప్రిన్సిపాల్ దగ్గరికి చేరుకున్న క్రమంలో ఈ పాఠశాల మాది , అంతా మా ఇష్టం , మీరెవరు అంటూ , గురుకుల కార్యదర్శి దగ్గరికి వెళ్లి అడగడానికి భయపడుతున్నావా అంటూ , వ్యక్తిగత విమర్శలు చేస్తూ తీవ్ర బాగోదానికి దిగిన ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు, సమస్యను లేవనెత్తిన విద్యార్థి నాయకులపై ఇలాంటి దాడులకు దిగుడం సిగ్గుచేటు, వెంటనే పాఠశాలకు సంబంధించిన కాస్మోటిక్ మరియు ఇతర నిధుల వినియోగంపై, మరియు సీట్ల కేటాంపు పై తక్షణమే విచారణ కమిటీ వేయాలని వాగ్వాదానికి దిగిన పద్యాల పై చర్యలకు తీసుకోవాలని లేదంటే ఆందోళనలు తీవ్రంగా జరుగుతాయని హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో వితేష్, అభి రామ్, కార్తీక్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు ఉచిత విద్యుత్ పంపిణీ చేయ్యాలి



**జర్నలిస్ట్ వార్త ఎల్కతుర్తి :** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎంపీడీఓ అధ్యక్షతన మండల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్పి సి ఒ అదనపు కలెక్టర్ శేషాద్రి, ప్రత్యేక అధికారి డి.ఆదిరెడ్డి పాల్గొన్నారు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ ఏవో రాజు కూమార్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా వ్యవసాయం, ఉద్యానవనం, విద్యుత్ తదితర రంగాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు పూర్తిగా వర్షాధార పంటలపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. సమావేశంలో దండేపల్లి గ్రామ సర్పంచు మాట్లాడుతూ, పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీలకు సంబంధించిన వీధి దీపాలు, మోటార్లకు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వం మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కోతుల నడుమ సర్పంచ్ లింగన్న ఆరేపల్లి సర్పంచి రాజు మాట్లాడుతూ గ్రామల్లో విద్యుత్ అధికారుల పనితీరు బాగాలేదని నిర్లక్ష్యంగా ఉన్నారని చిన్న పనికి కూడా నిర్లక్ష్య వైఖరి చేస్తున్నారని సర్పంచులు విద్యుత్ అధికారులపై మండిపడ్డారు ఈ కార్యక్రమంలో సర్పంచుల పురం మండల అధ్యక్షులు పుల్లూరు శ్రీధర్ రావు తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్‌లో మూడు రోజుల ప్రత్యేక ఉచిత యూరాలజీ క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలి

### ప్రముఖ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. జి మోహన్ చంద్



**పెద్దవంగర ఆగస్టు 1(జనం సాక్షి )** మూత్రం మంట, తరచుగా మూత్రం రావటం, మూత్రంలో రక్తం కనిపించడం, కిడ్నీ/ వెన్ను నొప్పి, కిడ్నీలో రాళ్లు, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు, ప్రోస్టేట్ గ్రంధి పెరుగుదల సమస్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట, వరంగల్ ఆధ్వర్యంలో ఈ నెల 03, 04, 05 తేదీల్లో ప్రత్యేక యూరాలజీ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. ఈ క్యాంప్‌లో ప్రముఖ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. జి మోహన్ చంద్ రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి, వ్యాధి తీవ్రతను అంచనా వేసి అవసరమైన చికిత్సపై సమగ్ర సలహాలు అందించనున్నారు. క్యాంప్ సందర్భంగా కంప్లీట్ బ్లడ్ కౌంట్, షుగర్ పరీక్ష, కంప్లీట్ మూత్ర పరీక్ష, క్రియాటినిన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ వైద్యుల సలహా మేరకు అందించబడతాయి. అంతేకాకుండా ఇతర ఇన్వెస్టిగేషన్స్ పైన 50 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు కూడా అందుబాటులో ఉంటుందని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ క్యాంప్ ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుంది. కిడ్నీ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రజలు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకుని ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం తెలియచేయడం జరిగింది స్థలం: అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్, కొత్తపేట క్రాస్ రోడ్, అరేపల్లి, వరంగల్ -- 506006. అపాయింట్‌మెంట్ వివరాలకు: 94598 75555.

## రైతులకు అవగాహన సదస్సు : ఏవో స్వామి నాయక్



**పెద్దవంగర ఆగస్టు 01(జనం సాక్షి )**రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి ఎద్దడిని తట్టుకునే ఆరుతడి పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి గుగులోతు స్వామి నాయక్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వర్షపావ పరిస్థితులు నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు ,పంట మార్పిడి విధానాలపై రైతులకు ఫీల్డ్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో ఆడపదడప కురిసే వర్షాలు ఆరుతడి పంటలకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. అందువల్ల రైతులు కంది, పెసర, మినుము, బొబ్బర్లు జొన్నలు, చిరుధాన్యాలు ,ఆయిల్ ఫామ్ లాంటి నీటి అవసరం తక్కువగా ఉండే పంటలను సాగు చేసుకోవాలని మరియు సకాలంలో చీడపిదలను నివారణ చర్యలు చేసుకోవాలని సూచించారు .తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను, వ్యవసాయ శాఖ సూచనలను అనుసరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ 12 విజయవంతం

- జిల్లాలో 74 మంది బాల కార్మికులకు విముక్తి.
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్.



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01(జనంసాక్షి ):** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు తప్పిపోయిన, విడిచిపెట్టబడిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చే లక్ష్యంతో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ , ఐపీఎస్ తెలిపారు. బాలల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి సంవత్సరం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జూలై 1 నుంచి జూలై 31 వరకు జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్--12 చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రతి సబ్‌డివిజన్ పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో హోటళ్లు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యాప్తంగా 74 మంది బాల కార్మికులను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ( సి డబ్ల్యూ సి ) ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు. అలాగే 18 సంవత్సరాల లోపు పిల్లలతో పనులు చేయిస్తున్న యజమానులపై 07 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆసిఫాబాద్ డివిజన్ 38 బాలబాలికలు, కాగజ్ నగర్ డివిజన్ 36 మంది బాలబాలికలను రక్షించగా, ఇందులో 71 మంది బాలురు కాగా 3 బాలికలు ఉన్నారు అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నా, బాల కార్మికులు ఎక్కడైనా పనిచేస్తున్నా, లేదా తప్పిపోయిన, విడిచిపెట్టబడిన చిన్నారుల సమాచారం తెలిసినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా డయల్--100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్--శ×× విజయవంతం కావడానికి సహకరించిన పోలీసు శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, జిల్లా బాలల సంరక్షణ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# గ్లైఫోసిట్ గడ్డి మందు ద్రావణం స్వాధీనం

## నలుగురుపై కేసు నమోదు

**భీమిని ఆగస్టు1 జనం సాక్షి.** మంచిర్యాల జిల్లా భీమిని పోలీసు స్టేషన్ పరిధిలో రాంపూర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో గ్లైఫోసిట్ ద్రావణం గడ్డి మందు ను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గడ్డి మందులను అక్రమంగా రవాణా చేసి రైతులకు విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురు నిందితులను భీమిని పోలీసులు అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి రూ.1.44 లక్షల విలువైన 290 లీటర్ల గ్లైఫోసిట్ ద్రావణం గడ్డి మందులు, ఒక టయోటా ఇన్నోవా కారు,రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారూ తాండూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ఈ వివరాలను వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు భీమిని ఎస్సై కోటేశ్వర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో మహారాష్ట్రలోని రాజూరా నుంచి గడ్డి మందులను కొనుగోలు చేసి భీమిని మండల పరిధిలో అక్రమంగా విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు నిందితులు



ఒప్పుకున్నారని చెప్పారు. గ్లైఫోసేట్ వంటి గడ్డి మందుల వినియోగం వల్ల భూమి సారవంతం తగ్గడం, పర్యావరణానికి హాని కలగడం,ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని డీసీపీ తెలిపారు. రైతులు ప్రభుత్వం అనుమతించిన, లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా గడ్డి మందులను విక్రయిస్తున్న వారి గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిలాబాద్ జిల్లాను అగ్ర స్థానంలో నిలపాలి

## డీవైఎస్ఓ దయానంద్ రెడ్డి



**మావల ఆగస్ట్ 02( జనం సాక్షి):** జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాను అగ్రస్థానం లో నిలపాలని డీఓఎస్ఓ దయానంద్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం నిర్వహించిన అథ్లెటిక్స్, జావెలిన్ త్రో జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక ఆనందాన్ని ఇస్తాయని అన్నారు, జిల్లా క్రీడాకారులు ఇప్పటికే అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నారని అన్నారు. రాష్ట్రస్థాయిలో విజయాలు సాధించాలంటే నిరంతర సాధనతో పాటు శిక్షకుల సలహాలు సూచనలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించాలని, క్రీడారంగంలో ఉజ్వల భవిష్యత్తుతో పాటు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 7, 8వ తేదీల్లో హనుమకొండ వేదికగా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రెజరర్ వీజీఎస్ రాకేష్, ఎస్జీఎఫ్ కార్యదర్శి ఆడే రామేశ్వర్, టీజీ పీడీ, పీఈటీల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంతారావు, స్వామి పాల్గొన్నారు.

## తెలంగాణ ఆర్యవైశ్య యువజన సంఘం

# రాష్ట్ర కార్యదర్శిగా మాడూరి ముక్తేశ్వర్



**రేగొండ, ఆగస్టు 01 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన మాడూరి ముక్తేశ్వర్ ను నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శిరుప అనిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముక్తేశ్వర్ ఆర్యవైశ్య సంఘం రేగొండ మండల అధ్యక్షులుగా, జిల్లా సంఘం నాయకులుగా అనేక సేవలు అందించారు. ఆయన సేవలను గుర్తించి ఆ రాష్ట్ర కమిటీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన మాడూరి ముక్తేశ్వర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు శిరుప అనిల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు పవిత్రం శ్రీనివాస్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన నియమకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులకు, బంధుమిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శిగా ఆర్యవైశ్య సంఘానికి మరిన్ని సేవలు అందిస్తానని తెలిపారు.

# రెగ్యులర్ ఎంపీడీవోను నియమించాలి



**నల్లబెల్లి, ఆగస్టు 01 (జనంసాక్షి):** నల్లబెల్లి మండలానికి రెగ్యులర్ ఎంపీడీవోను నియమించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి, సామాజిక ఉద్యమ నేత బట్టు సాంబయ్య కోరారు. ఈ మేరకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదకు సబ్ పోస్టాఫీసు రిజిస్టర్ పోస్టు ద్వారా వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడు మండలంలో 29 గ్రామపంచాయతీలు, 37,909 మంది జనాభా ఉన్నారని తెలిపారు. రెగ్యులర్ ఎంపీడీవో లేకపోవడంతో మండల ప్రజలు, గ్రామపంచాయతీలకు సంబంధించిన పనుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పర్యవేక్షణకు రెగ్యులర్ ఎంపీడీవో అవసరమన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే రెగ్యులర్ ఎంపీడీవోను నియమించాలని కోరారు.

# స్నేహితుడి కుటుంబానికి ‘పదో తరగతి మిత్రుల దాతృత్వం

## స్నేహితుల తరపున రూ. 25 వేల ఆర్థిక సాయం



**రేగొండ, ఆగస్టు 01( జనం సాక్షి):** అకాల మరణం చెందిన పాఠశాల మిత్రుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు పదో తరగతి పూర్వ విద్యార్థులు ఉదారత చాటుకుని మానవత్వాన్ని నిలబెట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన కంచరకుంట్ల శ్రీనివాస్ రెడ్డి ఇటీవలే గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. ఏడాది క్రితమే శ్రీనివాస్‌రెడ్డి భార్య కూడా మరణించడంతో,తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన బాల్య మిత్రులు తక్షణమే స్పందించారు. 2002వ సంవత్సరంలో శ్రీనివాస్ రెడ్డితో కలిసి పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒక్కటై తమ వంతు సహాయంగా రూ.25,000 ఆర్థిక సాయాన్ని సేకరించి శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. చిన్ననాటి మిత్రుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని,ఆ పిల్లలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలోపూర్వవిద్యార్థులురజిత,మంజుల,సువర్ణ,మనోహర్,చందు,రాజు,రాజేందర్,భాస్కర్,సంతోష్,అమరేందర్,తిరుపతి,మధుకర్,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈర్య తండాలో తల్లిపాల వారోత్సవాలు



**చెన్నారావుపేట, ఆగస్టు 1( జనం సాక్షి):** చెన్నారావుపేట గ్రామంలోని ఈర్య తండాలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. శనివారం అంగన్వాడీ టీచర్ మేడి సరోజన ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిపాలు, ముర్రుపాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రు పాలు తప్పకుండా తాగించాలని ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

**సర్పంచ్ హసీనాభాను**

మహదేవపూర్, ఆగస్టు 1 (జనంసాక్షి) : గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థినిలకు మెనూ ప్రకారం నాణ్యమైన అందించాలని సర్పంచ్ హసీనాభాను అన్నారు. శనివారం రోజున మహదేవపూర్ లోని గిరిజన బాలికల సంక్షేమ వెల్ఫేర్ వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్లోని వంటగదిలోని బియ్యంతో పాటు నిత్యవసర సరుకులను వంట పాత్రలోని భోజన నాణ్యతను. హాస్టల్లో ని పరిశు భ్రత విద్యార్థులకు కల్పిస్తున్నటువంటి వసతులను క్షుణ్ణంగా పరిశీలించి హాస్టల్ రికార్డులను తనిఖీ చేసి వార్డెన్ పనితీరుపై అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్లో పరిశుభ్రత విషయములో ఇలాంటి నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అదేవిధంగా ప్రభుత్వము విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని హాస్టల్ లో ఉండే ప్రతి విద్యార్థిని ఆరోగ్యంగా సురక్షితంగా ఉండేలా హాస్టల్ సిబ్బంది. వార్డెన్ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సర్పంచ్ సూచించారు. ఆమె వెంట పాలకవర్గ సభ్యులు గడ్డం స్వామి నల్లభోగసమ్మయ్య. చంద్రశేఖర్ మహ్మద్ బీన్ అలీ కొండపల్లి రాములు తదితరులు న్నారు.



## రైతులతో కలిసి గ్రామ వ్యవసాయ వనరులపై అధ్యయనం

దిలావర్పూర్, ఆగస్టు 01, (జనం సాక్షి): మండలంలోని గుండంపెల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నాలుగో సంవత్సరం విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కార్యానుభవ కార్యక్రమంలో భాగంగా పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండంపల్లి రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త డా. రాహుల్ విశ్వకర్మ, గ్రామ ఉప సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ సాధనాల ద్వారా గ్రామంలోని సహజ వనరులు, వ్యవసాయ విధానాలు, పంటల సాగు, సామాజిక-ఆర్థిక పరిస్థితులు , రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాచారం సేకరించారు. రైతులతో ముఖాముఖి చర్చలు జరిపి వారి అనుభవాలు, అవసరాలు తెలుసుకున్నారు.

**ట్రాన్సెక్ట్ వాక్ ద్వారా క్షేత్ర పరిశీలన**

అనంతరం విద్యార్థులు గ్రామంలో ట్రాన్సెక్ట్ వాక్ నిర్వహించారు. వ్యవసాయ భూములు, నీటి వనరులు, నేల రకాలు, పంటల స్థితి , గ్రామంలో అందుబాటులో ఉన్న వనరులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలాలను సందర్శించి పంటల పెంపకం, సాగులోని సవాళ్లపై చర్చించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ వాస్తవాలను దగ్గరగా తెలుసుకునే అవకాశం లభించిందని, అదే సమయంలో రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడుతుందని డా. రాహుల్ విశ్వకర్మ తెలిపారు.

## ప్రతి ప్రయాణం సురక్షితంగా ఉండాలి

పునరావాస చర్యలు చేపట్టారని వివరించారు. ఆపరేషన్ సందర్భంగా బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లు గుర్తించిన 12 మంది యజమానులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆపరేషన్లో జిల్లా పోలీసు శాఖతో పాటు కార్మిక శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాలల సంక్షేమ కమిటీ, చైల్డ్లైన్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేశాయి. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు, వీధి బాలలు లేదా ప్రమాదంలో ఉన్న చిన్నారులు కనిపిస్తే వెంటనే సమీప పోలీసు స్టేషన్కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.

## మంత్రిని కలిసిన కలెక్టర్



మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 1 (జనంసాక్షి) : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న నీటిమట్టం, ప్రాజెక్టు సామర్థ్యం అంశాలను పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర నీటిపారుదల, ఆహార – పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, అధికారులతో కలిసి రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ని మర్యాదపూర్వకముగా కలిసి మొక్కను అందజేశారు.

## స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం!

అవుతున్నట్లు సమాచారం. 4జీ, 5జీ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావడం వాటికి తోడు వైఫై కనెక్షన్లు సులువు కావడంతో ఎప్పుడు గ్రూపుల్లోనే బిజీ బిజీగా ఉంటున్నారు.

**వీడియో కాల్...**

ప్రస్తుతం మార్కెట్లోకి వస్తున్న స్మార్ట్ ఫోన్ లలో ఎన్నో యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. ఫ్రీ వీడియో కాలింగ్ సౌకర్యం ఎంత సేపైనా ఫ్రీగా మాట్లాడుకోవచ్చు. కేవలం డేటా చార్జీలు తప్ప మెయిన్ బ్యాలెన్స్ చార్జి కాదు. దీంతో దూరాన ఉన్న మిత్రులు దగ్గరగా ఉన్నట్లు మాట్లాడుకునే అదృష్టాన్ని కల్పిం చింది. వీడియో కాల్ ద్వారా ఒకరినొకరు చూసుకుంటూ మాట్లాడుకుం టున్నారు.

**ఫ్రెండ్స్ తో నిత్యం టచ్ లో...**

వాట్సాప్ మొబైల్స్ లో ఇప్పుడు ఒక ముఖ్యమైన అప్లికేషన్ ఫోన్లలో మాట్లాడుకోవడానికి బ్యాలెన్స్ లేకపోయినా పర్వాలేదు కానీ వాట్సప్ ఆప్షన్ లేకపోతే మాత్రం నేటి యువత నిమిషం కూడా ఉండలేక పోతున్నారు. పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు నిత్యం ఫ్రెండ్స్ తో టచ్ లో ఉండడమే ఇందుకు కారణం. ఏ చిన్న విషయాన్నైనా సెకండ్లలో అందరితో ఫోటోల రూపంలో షేర్ చేసుకుంటున్నారు. అంటే వాట్సాప్ యువతను ఎంతగానో ఆదరిస్తుంది.

## బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన

ఉంటుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... చిన్నతనంలోనే మంచి అలవాట్లు పిల్లలకు నేర్పించాలని, గుడ్ టచ్ – బాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లలకు వారి హక్కుల గురించి వివరించడం జరుగుతుందని, జె జె, పోక్సో చట్టాలపై పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని, బాల కార్మికులను రక్షించి వారికి నిర్బంధ విద్య అందిస్తున్నామని తెలిపారు. లైంగిక వేధింపులు, దాడులకు గురైన బాధితులను గుర్తించడం, బాధితులకు చట్టాలపై అవగాహన కల్పించడం, బాలలపై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు.

డి.సి.పి. మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మించబడుతుందని, బాలల హక్కులను రక్షించడం బాధ్యతగా తీసుకోవాలని, బాలలను సన్మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో వచ్చే అసాంఘిక అంశాలను నిరోధించి పిల్లలు చూడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు,బాలల హక్కుల పరిరక్షణ సమితి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిర్చి విత్తనాలు మొలకెత్తడంలో ఎలాంటి ప్రధాన సమస్య లేదు

**దామిని మిర్చి విత్తన మడులను పరిశీలించిన వ్యవసాయ. ఉద్యాన శాఖ అధికారులు**

నడికుడ ఆగస్టు 1 (జనం సాక్షి) : నడికూడ మండలం వరికోల్ గ్రామంలో దామిని-541 హైబ్రిడ్ మిర్చి విత్తనాలు నెం. కె 14.4తో పెంచిన మిర్చి నారులో మొలక శాతం తక్కువగా ఉందని ఇటీవల వరికోలు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించారు.రైతుల సంప్రదింపుపై వెంటనే స్పందించిన వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సంబంధిత రైతుల పొలాలను సందర్శించి క్షేత్రస్థాయిలో మిర్చి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా నారును పరిశీలించి రైతులతో మాట్లాడి పూర్తి వివరాలను సేకరించారు.క్షేత్ర పరిశీలన సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ప్రస్తుతం నారులో మొలక శాతం సంతృప్తికరంగా ఉందని, మొలక శాతం విషయంలో ఎలాంటి ప్రధాన సమస్య లేదని అధికారులకు తెలిపారు. అధికారులు నిర్వహించిన పరిశీలనలో కూడా నారు మొలక శాతం ఆశాజనకంగా ఉన్నట్లు గుర్తించారు.అనంతరం అధికారులు రైతులకు



అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ, నారు పెంపకంలో తగిన తేమను కొనసాగించాలని, అలాగే తెగుళ్ళు, పురుగుల నివారణకు వ్యవసాయ మరియు ఉద్యాన శాఖల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ క్షేత్ర సందర్శనలో పరకాల మండల వ్యవసాయ అధికారి సోమరతి శ్రీనివాస్, నడికూడ మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్, పరకాల ఉద్యాన శాఖ అధికారి ఎర్ల సునీల్, వ్యవసాయ విస్తరణ అధికారి మాదార రామకృష్ణ, ఉద్యాన విస్తరణ అధికారి బోనాల దేవేందర్, వరికోల్ గ్రామ సర్పంచ్ దొగ్గల కుమారస్వామి మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## దళిత మహిళా సర్పంచ్లను అడ్డుకున్నారని ఆరోపణలు

**ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక**



నెన్నెల, ఆగస్టు 1 (జనంసాక్షి) : నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో తమను అవమానించారని గొల్లపల్లి సర్పంచ్ జాడి లక్ష్మి, జోగాపూర్ మహిళా సర్పంచ్ ఆరోపించారు. రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరైన సందర్భంగా కొబ్బరికాయ కొట్టే కార్యక్రమంలో పాల్గొనేందుకు తమను ఆహ్వానించారని, అయితే కార్యక్రమ సమయంలో కాంగ్రెస్ నాయకుడు హరీష్ గౌడ్ అడ్డుకుని పాల్గొనకుండా చేశారని వారు ఆరోపించారు. దళిత మహిళా ప్రజాప్రతినిధులైన తమను ప్రజల ఎదుట అవమానించడం బాధాకరమని వారు పేర్కొన్నారు. దళిత వర్గానికి చెందిన ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఈ ఘటనపై స్పందించకపోవడం విచారకరమని విమర్శించారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాలతో కలిసి ఆందోళనలు చేపట్టి ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళా సర్పంచ్లు హెచ్చరించారు..

# చిన్నారుల ఆరోగ్యం, విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**

**అంగన్వాడి కేంద్రాల ఆకస్మిక తనిఖీ**





**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 01 (జనం సాక్షి) :** జిల్లాలోని ఐసీడీఎస్ వరంగల్ ప్రాజెక్టు ఉర్సు సెక్టార్-42 పరిధిలోని మేరవాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పరిసరాల పరిశుభ్రత, రికార్డులు, కొలతలు (మెజర్‌మెంట్స్), పిల్లలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రీ-స్కూల్ బోధనా కార్యక్రమాలను గమనించి అంగన్‌వాడీ టీచర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించిన కలెక్టర్, వారి ప్రతిభను అభినందించారు. పిల్లలకు తప్పనిసరిగా కాచి చల్లార్చిన మంచినీటినే అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఆడపిల్లలు ఉన్న కుటుంబాలు బాలిక సమృద్ధి యోజన పథకాన్ని వినియోగించుకుంటే భవిష్యత్తులో ఉన్నత విద్యకు ఆర్థికంగా ఉపయోగపడుతుందని తల్లులకు వివరించారు. అనంతరం చిన్నారులకు బాలామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సీడీపీఓ విద్య, సూపర్వైజర్ బత్తిని రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ వినిత, ఏఎల్ఎంసీ కమిటీ సభ్యులు స్పందన, రమ్య, శ్రీలత, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## అమీనాబాద్‌లో ద్విచక్ర వాహనాన్ని అపహరించికు పోయిన దొంగలు!



**చెన్నారావుపేట, ఆగస్టు 1 (జనం సాక్షి):** గుర్తుతెలియని దొంగలు ద్విచక్ర వాహనాన్ని అపహరించుకుపోయిన సంఘటన మండలంలోని అమీనాబాద్ గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన మురహరి విజయ్ కుమార్ రోజువారి మాదిరిగానే ప్యాషన్ ప్రో ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం రాత్రి తన ఇంటి ముందు పార్క్ చేసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించాడు. ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దొంగలు అపహరించుకొని వెళ్లి గ్రామ శివారులోని మోడల్ స్కూల్ సమీపంలో చెట్ల పొదల్లో పడవేసి ధ్వంసం చేశారు. వాహనంలోని బ్యాటరీని అపహరించుకుపోయినట్లు బాధితుడు మురహరి విజయ్ కుమార్ తెలిపాడు.

## 7వరకే నవోదయ 6వ తరగతి దరఖాస్తులకు చివరి గడువు..

**ప్రిన్సిపాల్ ఎ.ప్రవీణ్ కుమార్**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** 2027-28 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఆన్ లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 7 వరకు పొడిగించినట్లు పిఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ, మామునూర్ ప్రిన్సిపాల్ ఎ. ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2027-28 విద్యా సంవత్సరానికి సంబంధించిన జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష - 2027 కోసం 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాయదలచిన అర్హులైన విద్యార్థులు నిర్ణీత తేదీలోపు ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు https://navodaya.gov.in,https://cbscitms.rcil.gov.in/nvs/ వెబ్ సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## తల్లిపాలే శిశువుకు సంపూర్ణ రక్షణ

**కార్పొరేటర్ బొట్ల అనిత సత్యం**



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 1 (జనంసాక్షి) :** తల్లిపాలే శిశువుకు సంపూర్ణ రక్షణ అని గోసేవ మండల్ డివిజన్ కార్పొరేటర్ బొట్ల అనిత అన్నారు. శనివారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని గో సేవ మండల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఐ.కె.పి. ఆర్.పి. నజ్రీన్, వార్డు అధికారి సౌమ్య లతో కలిసి హాజరై అర్హులైన లబ్ధిదారులకు బాలామృతం, బాలామతం ప్లస్, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకు జననం జరిగిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, మొదటి 6 నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి తల్లి తన బిడ్డకు అందించాలని, ఆ తర్వాత రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగిస్తూనే వయస్సుకు తగిన అదనపు పోషకాహారం అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో అవసరమని, తల్లిపాలపై ఉన్న అపోహాలను తొలగించి ప్రతి తల్లి అవగాహనతో ముందుకు రావాలని అన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతం, బాలామృతం ప్లస్, కోడిగుడ్లు, పోషకాహార సేవలు, ఆరోగ్య కార్యక్రమాలను వినియోగించుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న మాతా-శిశు సంక్షేమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం, పరిశుభ్రత, శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## వేద మోడల్ స్కూల్‌లో బోనాల పండుగ



**సారంగాపూర్, ఆగస్టు 1(జనం సాక్షి) :** మండల కేంద్రంలోని జాం గ్రామంలోని వేద మోడల్ స్కూల్లో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు శివసత్తులు, పోతురాజుల వేషధారణలో ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా విద్యార్థులు ప్రదర్శన చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం , ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రంగు వినోద అంతిమయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**పెద్దవంగర, ఆగస్టు 01 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిపల్లి గ్రామ సర్పంచ్ రంగు మురళి గౌడ్,తల్లి రంగు వినోద (72) గుండెపోటుతో శనివారం తెల్లవారుజామున మరణించగా ఆమె పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాటోత్ నెహ్రూ నాయక్, మాజీ ఎంపీపీ బానోత్ జ్యోతివెంకన్న లు పూలమాలవేసి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, సీనియర్ నాయకులు సంకపెల్లి రవీందర్ రెడ్డి, దోనాల కరుణాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## కుంటాల మోడల్ స్కూల్లో డీపీఓ ఆకస్మిక తనిఖీ

- కుళ్లిన కూరగాయలపై తీవ్ర ఆగ్రహం



**కుంటాల, ఆగష్టు01(జనం సాక్షి):** నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్ ను పంచాయతీ అధికారి శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతులు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో వంట గదిలో విద్యార్థుల కొరకు నిల్వ ఉంచిన కూరగాయలు కుళ్ళిపోయి, అత్యంత నాణ్యత లేకుండా ఉండటాన్ని డీపీఓ గుర్తించారు. విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకుంటూ, ఇలాంటి నిరుపయోగమైన కూరగాయలను వాడటంపై వంట సిబ్బంది మరియు హాస్టల్ నిర్వాహకులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనివాస్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని, విద్యార్థులకు నిత్యం తాజా కూరగాయలతో కూడిన పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలని ఆదేశించారు. వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వీడకుంటే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



## భారీవర్షాలకు నష్టపోయిన నందిగామ రైతులు

**పెంచికల్ పేట్ ఆగస్టు 1,(జనంసాక్షి ) :** గత నాలుగు రోజులుగా కురిసిన భారీవర్షాలకు మండలంలోని నందిగామ పత్తి పంట వేసిన రైతులను నట్టేట్ట ముంచిందని రైతులు ఆవేదన చెందరు. అప్పులు తెచ్చి పత్తి పంటను వేశామని, పంటానంత బురద తో కప్పి వేసిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం సర్వే చేసిన పంట నష్టాన్ని ఇప్పించే విదంగా చూడాలని అధికారులను గ్రామస్తులంతా కోరారు.



## రోడ్డు గుంతలను పూడ్చిన యువకుడు

**సారంగాపూర్, ఆగస్టు 1(జనం సాక్షి) :** వర్షాకాలం గుంతలు నిండిపోయి ప్రమాదాలకు జరిగే అవకాశం ఉన్నందున వైకుంటపూర్ గ్రామానికి చెందిన సుంకరి చందు తన సొంత డబ్బులతో కంకేట ఎక్స్ రోడ్ నుండి వైకుంతపూర్( ధోనిగాం) గ్రామం వరకు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు పై ఉన్న గుంతలను పూడ్చారు. తను చేసిన మంచి ఆలోచనకి గ్రామస్తులు అభినందించారు.